నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 26-4-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 215 | పేజీలు:4 | వెల: రూ.1/-

సొంత ఖర్చులతో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి వేముల

వేల్పూర్, ఏప్రిల్ 25: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ యువతీ యువకుల కోసం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సొంత ఖర్చులతో వేల్పూరు మండలం పడిగల్, హనుమాన్‌నగర్(వడ్డెర కాలనీ) లో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు.

ఉచిత శిక్షణ కోసం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సుమారు 500 మంది యువతీ యువకుల కోసం 3 నెలల పూర్తి శిక్షణతో పాటు ఉచిత మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

దానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో తగు వసతులు ఏర్పాటు చేయాలని, వేడి నుంచి ఉపశమనం కోసం కూలర్లు సమకూర్చాలని నిర్వాహకులకు సూచించారు.

ప్రతి రోజు వేల్పూరు మండలానికి చెందిన 16 గ్రామాల సర్పంచ్‌లు, టీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, పలువురు ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వంతుల వారీగా మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చూసుకుంటామని చెప్పటం సంతోషకరం అన్నారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. మీరు చేయాల్సింది ఉద్యోగం సంపాదించడమేనని, బాగా చదివి ఉద్యోగం పొందాలని మంత్రి సూచించారు.

గుజరాత్ తీరంలో రూ.280 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత

అహ్మదాబాద్, ఏప్రిల్ 25:: భారత్‌లోకి మాదక ద్రవ్యాలను తరలించేందుకు పాక్ కుట్రలు పన్నుతున్నది. పక్కాగా అందించిన సమాచారం మేరకు అరేబియా సముద్రం మార్గంలో తరలించేందుకు యత్నిస్తుండగా.. ఇండియన్ కోస్ట్‌గార్డ్ కుట్రను భగ్నం చేసింది. ఇండియన్ కోస్ట్‌గార్డ్, గుజరాత్ ఏటీఎస్ సంయుక్త ఆపరేషన్ నిర్వహించి పాక్ బోటులో నుంచి భారీగా హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఈ సందర్భంగా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని జకావూకు తరలించారు. బోట్‌లో 55 హెరాయిన్ ప్యాకెట్లలో 56 కిలోల వరకు హెరాయిన్‌ను స్వాధీనం చేసుకోగా.. బహిరంగ మార్కెట్‌లో దాని విలువ రూ.280కోట్ల వరకు ఉంటుందని అంచనా.అయితే, ఇండియన్ కోస్ట్‌గార్డ్, గుజరాత్ ఏటీఎస్‌ను చూసిన స్మగ్లర్లు తప్పించుకొని పాక్ వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. కాల్పులు జరిపి పారిపోకుండా అడ్డుకున్నారు. ఇదిలా ఉండగా.. నిన్న అట్టారీ సరిహద్దులో ఆదివారం కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ రూ.700కోట్ల విలువైన 102 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఆఫ్ఘనిస్తాన్ నుంచి తరలించగా.. అమృత్‌సర్ కస్టమ్స్ (పీ) కమిషనరేట్ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ (ఐసీపీ)లో 102కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది.

మే 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో ఇంక్‌ఏవాష్.. లోగో ఆవిష్కరించిన కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 25: వాష్ ఇన్నోవేషన్ హబ్ లోగోను రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత అంశాల్లో ఆవిష్కరణలకు ప్రోత్సాహం కల్పించనున్నారు. ఆస్కితో కలిసి వాష్ ఇన్నోవేషన్ హబ్‌ను పురపాలక శాఖ ఏర్పాటు చేసింది. మే 5, 6వ తేదీల్లో హైదరాబాద్‌లో ఇంక్‌ఏవాష్ 3.0 కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇంక్‌ఏవాష్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

సంగారెడ్డి, ఏప్రిల్, 25 (నేటి నిజం ప్రతినిధి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ రాజర్షి షా జెండా ఊపి ప్రారంభించారు, అనంతరం ర్యాలీ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన తెలంగాణ రాష్ట్రంలో మలేరియాను తరిమివేయాలని లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ విస్తృతమైన చర్యలు తీసుకుంటుందని, 2030 సంవత్సరం నాటికి దేశంలోని మలేరియా వ్యాధిని తరిమి వేయాలని లక్ష్యంగా ప్రణాళికలు చేశామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు సహకరించాలని కోరారు. జ్వరం ఉన్న వారందరూ రక్త పరీక్షలు చేయించుకోవాలి అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, సుందరి, జిల్లా మలేరియా కార్యాలయ సిబ్బంది ఉమాకాంత్, సాయి ప్రసాద్, అశోక్, కమల, మురళి, శ్రీకాంత్ మరియు యు.ఎన్ బేడ్కర్ పారా మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ చిందుల చిందుల నెరుగక
బందుల జూ నాడు కొనెడి బాలల తొలకై
చిందున రచనల జేయుగ
సందడి సమున నెంటు దొసు జిలాదేవీనే !!

(ఏప్రిల్ 25 రచయిత్రి డీ. సుజాతాదేవి జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

యాదాద్రి సన్నిధిలో సీఎం కేసీఆర్ దంపతులు

యాదాద్రి భువనగిరి,ఏప్రిల్ 25 : యాదాద్రి సన్నిధిలో ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలో స్వామి వారిని కేసీఆర్ దంపతులు దర్శించుకున్నారు. అనంతరం కేసీఆర్ దంపతులను అర్చక బృందం ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆ తర్వాత రామలింగేశ్వర స్వామి ఆలయ ఉద్ఘాటన క్రతువులో సీఎం కేసీఆర్, ఆయన సతీమణి శోభ పాల్గొన్నారు. మహా పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం పూజల్లో పాల్గొన్నారు. తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామివారి చేతుల మీదుగా ఉద్ఘాటన క్రతువును నిర్వహించారు. సీఎం కేసీఆర్ వెంట మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జగదీష్ రెడ్డి, ఎంపీ సంతోష్ కుమార్ ఉన్నారు.

ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓటమి ఖాయం: కిషన్‌రెడ్డి

భూపాలపల్లి, ఏప్రిల్ 25:: సింగరేణిని ప్రైవేటీకరణ చేసే ఉద్దేశ్యం కేంద్రానికి లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి ఒడిశాలో బొగ్గు గనులు కొనుగోలు చేస్తోంది.. తెలంగాణలో ఎందుకు కొనడం లేదు? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. బీజేపీ ఎదుగుదలను టీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

అంబేద్కర్ తర్వాత అంతగా ఆలోచించేది సీఎం కేసీఆర్ ఒక్కరే : మంత్రి ఎర్రబెల్లి

జనగామ, ఏప్రిల్ 25: దేశంలో అంబేద్కర్ తర్వాత అంతగా దళితుల గురించి ఆలోంచి, వారి కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా దళిత బంధు అనే పథకాన్ని ప్రారంభించిన ఘతన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో రూ. 5 కోట్ల విలువైన 50 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. దళిత బంధును జిల్లాలో 185 మంది లబ్ధిదారులకు 18 కోట్ల 50 లక్షలు మంజురు చేయగా.. పాలకుర్తి నియోజకవర్గంలో 5 కోట్లతో 50 యూనిట్లు మంజూరు చేశామన్నారు. జనగామ నియోజకవర్గంలో 60 యూనిట్లు, స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో 75 యూనిట్లు ఇస్తున్నామన్నారు.

185 యూనిట్లకు ఇప్పటికే నిధులు మంజూరయ్యాయి.

రూ.18 కోట్ల 50 లక్షల నిధులు విడుదలయ్యాయని మంత్రి వివరించారు. కాగా, పాలకుర్తి మండలంలోని తీగారం గ్రామంలో 20 మందికి, దేవరుప్పుల మండలంలోని బంజర గ్రామంలో 15 మందికి, కొడకండ్ల మండలంలోని రామన్నగూడెం గ్రామంలో 15 మందికి మొదటి విడతగా వారు కోరుకున్న యూనిట్లనే ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి 196 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శివ లింగయ్య, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జెడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఆర్డీవో రామ్ రెడ్డి, జిల్లా ఎస్పీ సంక్షేమాధికారి కుర్నేలియస్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఎప్పుడు..? : మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 25: కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. ఆ ఉద్యోగాల భర్తీ ఎప్పుడు చేపడుతారో చెప్పాలని డిమాండ్ చేశారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షల ఉద్యోగార్థులకు ఉచిత భోజనం కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ రోజా శర్మ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ప్రతియేటా ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేస్తామని స్పష్టం చేశారు. గ్రూప్-1, 2 ఇంటర్వ్యూలు లేకుండా రాత పరీక్షతో పారదర్శకతతో ఉద్యోగ నియామకాలు చేపడుతామన్నారు. త్వరలోనే 500లకు పైగా పోస్టులతో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుందని తెలిపారు. 317జీఓతో అన్నీ జిల్లాల ఉద్యోగులకు సమన్యాయం చేస్తున్నాం. దీనిపై ప్రతిపక్షాలు కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లు మాట్లాడటం తగదన్నారు. 317జీఓ సారాంశం తెలియకుండా బీజేపీ బండి సంజయ్ ఎందుకు దీక్ష చేపట్టారో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రతిపక్షాలు దున్నపోతు ఈనిందటే దుడ్డెను కట్టేయన్నట్లు ఉన్నదని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఖాళీగా ఉన్న 15 లక్షల 65 వేల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తుందో తెలపాలని రాష్ట్ర బీజేపీ నేత బండి సంజయ్‌ను మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేవలం ఒక్క రైల్వేశాఖలో 3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ అంశాలపై బీజేపి నాయకులను ప్రశ్నిస్తే సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తారని పేర్కొన్నారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు ఇస్తామంటే మీకే పాలాభిషేకం చేస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

తెలంగాణలో తొలి మహిళా యూనివర్సిటీ ఏర్పాటు.. జీవో జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 25:తెలంగాణ ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు మహిళా యూనివర్సిటీ లేదు. దీంతో కోఠి ఉమెన్స్ కాలేజీని యూనివర్సిటీగా మారుస్తూ ఇవ్వాల జీవో జారీ చేసింది. దీంతో ఎంతో మంది స్టూడెంట్స్?కి ఇక ఇబ్బందులు తప్పినట్టే అని చెప్పుకోవచ్చు. తెలంగాణలో అమ్మాయిలకు ఉన్నతవిద్యలో అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. మహిళా విద్యాభివృద్ధి లక్ష్యంగా ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 1983లో తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చారు. తద్వారా ఉమ్మడి రాష్ట్రంలో గ్రామీణ యువతులకు సామాజిక, సాంకేతిక, వైజ్ఞానిక శాస్త్ర రంగాల్లో అరుదైన కోర్సులను అభ్యసించే అవకాశం లభించింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఆడపడుచులకు ప్రత్యేక విశ్వవిద్యాలయం లేకపోవడంతో చాలా విమర్శలొచ్చాయి.

ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఆర్కిటెక్ట్ తదితర కోర్సుల్లో తెలంగాణలో ఉన్నత విద్యావకాశాలు అంతగా లేకపోవడం వల్ల కొందరు ఇతర రాష్ట్రానికి వెళ్లాల్సి వస్తోంది. అమ్మాయిలను ఉన్నత చదువు కోసం బయట రాష్ట్రాలకు పంపడానికి చాలా కుటుంబాలు అభ్యంతరం తెలపడంతో ఆడపిల్లల కలలు కల్లలుగానే మిగిలిపోతున్నాయి. కాగా, కోఠి ఉమెన్స్ కాలేజీని అమ్మాయిలకు ఉచిత ఉన్నత విద్యావకాశాలను కల్పించడం ద్వారా వాళ్లకు మరింత మేలు కలుగుతుందని ప్రభుత్వం భావించింది.

టీఆర్ఎస్ ప్లీనరీ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తలసాని

హైదరాబాద్, ఏప్రిల్ 25: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 27న టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న ప్లీనరీ ఏర్పాట్లను సోమవారం ఊఎఅఐ లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి 21 సంవత్సరాలు పూర్తయ్యాయి.

అంతేకాదు రెండు సార్లు అధికారంలోకి వచ్చిందని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రగతిలో దూసుకెళుందన్నారు. రాష్ట్రంలో 24 గంటలు విద్యుత్ సరఫరా, మిషన భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరించి భూగర్భజలాలు పెంపొందించినట్లు చెప్పారు.

అంతేకాకుండా రైతులకు పంట పెట్టుబడుల కోసం ఎకరానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరుగుతుంటే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలకు కనిపించట్లేదని ధ్వజమెత్తారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 65 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎందుకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ప్రశ్నించారు.తెలంగాణ రాష్ట్రం దేశానికే అన్నపూర్ణగా మారిందని అన్నారు. మంత్రి వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్, మేయర్ విజయలక్ష్మి, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హాఎఅ చైర్మన్ గాదరి బాలమల్లు, మాజీ మేయర్ బొంతు రాంమోహన్ తదితరులు ఉన్నారు.

జల విద్యుత్ కేంద్రాల శంకుస్థాపనపై పాక్ తీవ్ర అభ్యంతరం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కశ్మీర్ పర్యటనపై దాయాది పాకిస్తాన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. చీనాబ్ నదిపై రాట్లే, క్వార్ జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి చేసిన శంకుస్థాపన చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలా చేయడం సింధు జల ఒప్పందాన్ని ప్రత్యక్షంగా ఉల్లంఘించినట్లే అవుతుందని పాక్ మండిపడింది.

ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం జమ్మూ కశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు రూ.5300 కోట్లతో చినాబ్ నదిపై తలపెట్టిన 850 మెగావాట్ల రాట్లే జలవిద్యుత్ కేంద్రానికి, రూ.4500 కోట్లతో చేపట్టిన 540 మెగావాట్ల క్వార్ జలవిద్యుత్ కేంద్రానికి మోదీ శంకుస్థాపన చేశారు. దీనిపైనే పాక్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

లోయలో సాధారణ పరిస్థితులు నెలకొనలేదని, అలా సాధారణ పరిస్థితులు నెలకొన్నాయన్న బూటకపు మాటలను మోదీ మాట్లాడుతున్నారని పాక్ ధ్వజమెత్తింది. ఇదో ఎత్తుగడ అంటూ దెప్పిపొడించింది. 2019 ఆగస్టు 5 తర్వాత లోయలో జరుగుతున్న వాస్తవ పరిణామాలన్నింటినో కప్పిపుచ్చడానికి భారత్ ప్రయత్నాలు చేసిందని, వీటన్నింటిని అంతర్జాతీయ సమాజం చూసిందని పాక్ విదేశాంగ శాఖ పేర్కొంది.

చినాబ్ నదిపై రాట్లే, క్వార్ జలవిద్యుత్ కేంద్రాలకు శంకు స్థాపన చేస్తున్న సమయంలో కనీసం మాట కూడా తమకు చెప్పలేదని పాక్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా చేయడమంటే 1960 లో జల ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అవుతుందని పాక్ మండిపడింది.

లైఫ్‌సైన్సెస్ సెక్టార్‌లో పురోగమిస్తున్న హైదరాబాద్: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 25: లైఫ్‌సైన్సెస్ సెక్టార్‌లో హైదరాబాద్ మరింత పురోగమిస్తున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రపంచంలోనే ఉన్నత ప్రమాణాలతో జీనోమ్ వ్యాలీ నడుస్తున్నదని చెప్పారు. హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో స్విట్జర్లాండ్‌కు చెందిన ఫెర్రింగ్ ఔషధరంగ సంస్థ ఏర్పాటు చేసిన ఫెర్రింగ్ ఫార్మాస్యూటికల్స్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం కోసం ఫెర్రింగ్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. 30 మిలియన్ యూరోలతో ఫెర్రింగ్ కంపెనీ ఏర్పాటయిందన్నారు.

టీఎస్ఐఐసీ బయోటెక్ పార్కులో ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా 110 మందికి ఉద్యోగాలు లభించాయని చెప్పారు. స్విట్జర్లాండ్ వేదికగా కంపెనీ కార్యకలాపాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఇందులో తల్లీబిడ్డల ఆరోగ్యానికి అవసరమైన మందులు తయారవుతాయని వెల్లడించారు.

సూడన్‌లో తెగల మధ్య ఘర్షణలు.. 168 మంది మృతి

ఖార్టూమ్, ఏప్రిల్ 25: సూడాన్ డార్ఫర్ ప్రాంతంలో అరబ్బులు, అరబ్బుయేతరుల మధ్య ఆదివారం ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘటనలో 168 మంది దుర్మరణం చెందగా.. మరో 98 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని డార్ఫర్‌లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే ఓ సంస్థ జనరల్ కోఆర్డినేషన్ ప్రతినిధి ఆడమ్ రీగల్ తెలిపారు. గురువారం వెస్ట్ డార్ఫర్ ప్రావిన్షియల్ రాజధాని జెనెనాకు తూర్పున 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్రెనిక్‌లో గుర్తు తెలియని దుండగుడు ఇద్దరు వ్యక్తులను హతమార్చడంతో ఘర్షణలు చెలరేగాయని ఆయన చెప్పారు. ఆ తర్వాత హింస ఉగ్రరూపం దాల్చాయి. జాన్?జావీద్ అనే మిలీషియాలు ఆదివారం క్రెనెక్‌లో ఆయుధాలతో దాడి చేసి ఇండ్లను లూటీ చేసి, ఆ తర్వాత వాటిని తగలబెట్టారు.

అనంతరం ఘర్షణలు జెనీనాకు చేరగా.. సాయుధులు నగరంలోని ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిపై సైతం కాల్పులు జరిపారని ఆసుపత్రి వైద్యుడు సలాహ్ సలేహ్ పేర్కొన్నారు. గత గురువారం మొదలైన హింసలో 8 మంది చనిపోగా.. 16 మంది గాయపడ్డారు. ఆ తర్వాత భారీగా బలగాలను మోహరించినా.. హింసను అడ్డుకోలేకపోయారు. డార్ఫర్ ప్రాంతంలో కొన్ని ఆదివాసీ వర్గాల మధ్య వైరం కొనసాగుతున్నది. ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం.. ఇప్పటి వరకు జరిగిన ఘర్షణల్లో మూడలక్షల మంది వరకు మృతి చెందగా.. 2.5 మిలియన్ల మంది జనం నిరాశ్రయులయ్యారు. ప్రధానంగా పచ్చిక బయళ్లు, నీటి కోసం తరుచూ ఘర్షణలు చెలరేగుతుంటాయి. సూడాన్‌లోని డార్ఫర్ ప్రాంతంలో ఇటీవలి నెలల్లో తెగల మధ్య ఘర్షణలు నెలకొంటున్నాయి. గత సంవత్సరం తిరుగుబాటు తర్వాత దేశం సంక్షోభంలో చిక్కుకున్నది.

బోధన్‌లో విదేశీ కరెన్సీ మార్పిడీ పేరుతో మోసాలు : ఏసీపీ రామారావు

నిజామాబాద్, ఏప్రిల్ 25: విదేశీ కరెన్సీ మార్పిడీ పేరుతో కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఏసీపీ రామారావు అన్నారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ..వెస్ట్ బెంగాల్ ప్రాంతానికి చెందిన వారు విదేశీ కరెన్సీ మార్పిడీ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని ఏసీపీ వెల్లడించారు. ఇందులో భాగంగా బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఈ నెల 18న కేసు నమోదు చేసినట్లు వివరించారు.కామారెడ్డి జిల్లా బాన్స్ వాడకు చెందిన ఎజాజ్ ఖాన్ అనే వ్యక్తికి బోధన్ లో రూ. 5లక్షల విలువైన విదేశీ కరెన్సీని రూ. 2.5 లక్షలకు ఇస్తామని నమ్మించి, 2.5 లక్షలు తీదుకుని ఓ బ్యాగ్ అందచేసి వెళ్లిపోయారు.ఆ బ్యాగ్ తెరిచి చూడగా అందులో చిత్తు కాగితాలు, న్యూస్ పేపర్ లు ఉండడం గుర్తించిన సదరు వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు.ఈ సంఘటన పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఏసీపీ రామారావు వివరాలను వెల్లడించారు. ఇలాంటి సంఘటనలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లభర్తీకి నోటిఫికేషన్-26వ తేది ఒంటి గంట వరకు

వరంగల్, ఏప్రిల్ 25: రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లభర్తీకి కాళోజి నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. సోమవారం సాయంత్రం 6గంటల నుంచి, మంగళవారం మధ్యాహ్నం 1 గంటలవరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని పేర్కొంది. ఫైనల్ మాప్ ఆప్ విడత కౌన్సిలింగ్ తర్వాత ఖాళీగా ఉన్న సీట్లను స్ట్రేవెకెన్సీ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. సీట్ల ఖాళీల వివరాలు వెబ్ సైట్ లో పొందుపర్చినట్లు వెల్లడించింది.ఇప్పటికే యూనివర్సిటీ విడుదల చేసిన తుది మెరిట్ జాబితాలోని అర్హులైన విద్యార్థులు ఈ విడత వెబ్ కౌన్సిలింగ్ లో పాల్గొనవచ్చని తెలిపింది. గత విడత కౌన్సిలింగ్ లో సీట్ అలాట్ అయి జాయిన్ కాకపోయిన చేరి డిస్ కంటిన్యూ చేసిన అదేవిధంగా ఆల్ ఇండియా కోటాలో ఇప్పటికే చేరినా విద్యార్థులతో పాటు ఎన్ టీ ఆర్ యు హెచ్ ఎస్ లో సీటు పొందిన విద్యార్థులు ఈ కౌన్సిలింగ్ కు అనర్హులుగా పేర్కొంది.

సృజనశీలతే ఆధునికత పోకడలకు పునాది...!

(26 ఏప్రిల్ 'ప్రపంచ మేధో సంపత్తి హక్కుల దినం' సందర్భంగా)

చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు (స్మాల్ అండ్ మీడియమ్ సైజ్డ్ ఎంటర్‌ప్రైజెస్, యస్‌యంఈలు) లాభాల బాటలో సాగడానికి, సామాన్యులకు అందుబాటులో శాస్త్రసాంకేతిక విప్లవ ఫలాలను నిలవటానికి, దేశ ఆర్థిక రంగం పరిపుష్టం కావడానికి సృజనశీల భావనలు, వినూత్న ప్రతిపాదనలతో కూడిన మేధో సంపత్తి ఆలోచనలు దోహదపడతాయనేది వాస్తవం. సాంప్రదాయ ప్రక్రియలకు ప్రత్యామ్నాయంగా క్రియాశీల, సరళ, బహుళ ప్రయోజన ఉపకరణాలు మార్కెట్‌లో ప్రవేశ పెట్టడానికి వినూత్న మేధో సంపత్తి అవసరం అవుతుందనే విషయాలను చర్చించడానికి ప్రతి ఏటా 26 ఏప్రిల్ రోజున విశ్వవ్యాప్తంగా 'ప్రపంచ మేధో సంపత్తి హక్కుల దినం' పాటిస్తారు. వినూత్న ఆవిష్కరణలు, సృజనశీల ప్రక్రియలను ప్రోత్సహించే క్రమంలో మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుంది. ప్రపంచ మేధో హక్కుల దినం-2022 నినాదంగా 'మేధో హక్కులు - బంగారు భవిత కోసం వినూత్న ఆలోచనల యువత' అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. కొన్ని దేశాల్లో ఏప్రిల్ 26 నుంచి 30 వరకు 'ప్రపంచ మేధో హక్కుల వారోత్సవాలు' జరుపుకునే ఆనవాయితీ ఉన్నది.

ప్రతి వ్యాపారానికి ఓ స్పష్టమైన ఆలోచన ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు విస్తరించబడి ఉన్నాయి. ఓ ఆవిష్కర్త మెదడులో అంకురించిన వినూత్న సృజనశీల ఆలోచనలకు కార్యరూపం ఇవ్వడం ద్వారా వ్యాపార సంస్థ ఆవిర్భవిస్తుంది. ఈ ఆలోచన విలక్షణతను కలిగి ఉన్నట్లైతే సామాన్యుని దృష్టిని ఆకర్షించి వ్యాపారం సత్వరమే వృద్ధి చెందుతుంది. మేధలో జనించిన నవ్య ఆలోచనలు మార్కెట్ అవసరాలకు అనుకూలంగా ఉండాలి. మార్కెట్‌లో సఫలమైన ఆలోచనలకు కారణమైన ఆవిష్కర్తలను, సృష్టి కర్తలను కొనియాడడానికి 'ప్రపంచ మేధో సంపత్తి హక్కుల దినం' వేదిక ఉపయోగపడాలి. ఆకర్షనీయ, ఉపయోగకరమైన వస్తువులు/ఉపకరణాలు/ఉత్పత్తులు/కంపెనీలు/పరిశ్రమలను ప్రోత్సాహపూర్వకంగా అభినందించడం మన కర్తవ్యంగా భావించాలి. సమాజ సేవతో పాటు దేశ ఆర్థిక గమనానికి ఊతం ఇవ్వగల చిన్న, మధ్య తరహా వ్యాపారాల ప్రగతి మేధో సంపత్తి మీదనే ఆధారపడి ఉండడంతో మేధో సంపత్తి హక్కులకు అధిక ప్రాధాన్యత సంతరించుకున్నది.

భారత ప్రభుత్వ వాణిజ్య మంత్రిత్వశాఖ పరిధిలోకి మేధో సంపత్తి హక్కులు వస్తాయి. వాణిజ్య రంగంలో ప్రముఖంగా వాడబడే కళా ఖండాలు, చిహ్నాలు, పేర్లు, చిత్రాలు (ఇమేజెస్) లాంటివి మేధో సంపత్తులుగా వర్గీకరించబడినవి. మేధో సంపత్తికి కారణమైన ఆవిష్కర్తకు సరైన హక్కులు, గుర్తింపు ఉండేలా చట్టాలు చేయబడ్డాయి. మేధో సంపత్తి హక్కులు రెండు రకాలుగా ఉంటాయి. సాహిత్య మరియు కళాత్మక క్రియలకు సంబంధించిన 'కాపీ రైట్స్' కనీసం 50 ఏండ్లు వరకు ఉంటాయి. పారిశ్రామిక రంగంలో వాడే ట్రేడ్‌మార్కులు, జియోగ్రాఫికల్ ఇండికేటర్స్, పెటెంట్లు, చిహ్నాలు, డిజైన్లు, ట్రేడ్ సీక్రెట్లు లాంటివి కూడా మేధో సంపత్తి హక్కులుగా గుర్తించబడినవి. ఆవిష్కర్తలు, సృజనశీలురకు చట్టం ద్వారా హక్కులు ఇవ్వబడ్డాయి. మేధో సంపత్తి రంగంతో ఆర్థిక పురోగతి, ఉద్యోగ కల్పన, పారిశ్రామిక ప్రగతి, వ్యాపార వెసులుబాటు లాంటి ప్రయోజనాలతో పాటుగా సామాన్యుని జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఆవిష్కర్తకు పరిమిత కాల వ్యవధితో కూడిన మేధో సంపత్తి హక్కులు లభించటం వల్ల ఆవిష్కర్తలకు ప్రోత్సాహం/గుర్తింపు కలుగుతుంది.

జాతీయ మేధో హక్కుల విధానం-2016 ప్రకారం 'క్రియేటివ్ ఇండియా ; ఇన్నోవేటివ్ ఇండియా' నినాదంతో ముందు సాగడం జరుగుతున్నది. మేధో సంపత్తి హక్కుల పరిరక్షణకు 'డిపార్టుమెంటు ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్' నాయకత్వంలో 'సెల్ ఫర్ ఐపిఆర్ ప్రమోషన్ అండ్ మేనేజ్‌మెంట్' విభాగం విశేష కృషి చేస్తున్నది. గ్లోబల్ ఇన్నోవేటివ్ ఇండెక్స్-2019 నివేదిక ప్రకారం భారత ర్యాంకు 52 ఇవ్వబడింది. ఇండియాలో ఐసిటి, సర్వీస్ ఎగుమతులు, వినూత్న వస్తు ఎగుమతులు, విశ్వవిద్యాలయ నాణ్యతలు లాంటివి ఇన్నోవేషన్ వృద్ధికి దోహదపడుతున్నాయి. గ్లోబల్ ఇన్నోవేటివ్ ఇండెక్స్ జాబితాలో 1వ ర్యాంకులో స్విజర్లాండ్ ఉండగా తరువాత స్థానాల్లో స్వీడెన్, అమెరికా, నెథర్లాండ్, యూకె, ఫిన్‌లాండ్, డెన్మార్క్, సింగపూర్, జర్మనీ, ఇజ్రాయిల్‌లు ఉన్నాయి. ఈ జాబితాలో 52వ ర్యాంకు పొందిన భారత్‌లో నాణ్యమైన విద్యాసంస్థలు, ఉన్నత విద్య ప్రమాణాలు, మానవ వనరులు, మౌళిక సదుపాయాలు, ఆవిష్కర్తల ప్రోత్సాహం, పరిశోధనలకు నిధులు లాంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో ఇన్నోవేషన్ రంగంలో మన దేశ ర్యాంకు మెరుగు పడుతుందనటంలో సందేహం లేదు. ఆధునికతకు, సరళ జీవన విధానానికి పునాది వినూత్న సృజనశీల ఆవిష్కరణ అని నమ్ముదాం. ఆవిష్కర్తలను అక్కున చేర్చుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

వరంగల్ సభ వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీస్తాం : ఉత్తమ్

సూర్యాపేట, ఏప్రిల్ 25: : వరంగల్ సభ వేదికగా రైతులకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీస్తామని నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ట్రెండింగ్ అవుతున్న పీకే ఫ్యాక్టర్ పై స్పందించారు. మీడియా ద్వారానే పీకే విషయం వింటున్నానన్నారు. పీకే ఫ్యాక్టర్ పై అధికారిక సమాచారం లేదని, ఢిల్లీలో ఏం జరుగుతుందో తెలియదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా ఎన్నికల్లోకి వెళ్లి, అధికారంలోకి రాబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ రాహుల్ గాంధీ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలో పంట పెట్టుబడి పెరిగి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఎరువులు లేవు, రుణమాఫీ చేయడంలో విఫలమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. పంట భీమా లేని ఏకైక రాష్ట్రం దేశంలో తెలంగాణా మాత్రమేనన్నారు. రైతులకు న్యాయం చేయలేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొంగ దీక్షలు చేస్తున్నాయన్నారు. ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేసీఆర్ నిర్లక్ష్యంతో రైతులు నష్టానికి ధాన్యం అమ్ముకుంటున్నారన్నారు. కేంద్రం నుండి వచ్చిన రూ.200కోట్ల పంట భీమా సొమ్ముని కేసీఆర్ పక్కదారి పట్టించారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో రైతులకు మేలు చేసే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అనురాధ కిషన్ రావు, నాయకులు బైరు శైలేందర్ గౌడ్, అంజద్ అలీ, శ్రీనివాస్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సిబీఎస్ఈకి కొత్త అర్థం చెప్పిన రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌సీ)కి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొత్త నిర్వచనం ఇచ్చారు. నిజానికి ఇది "సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సప్రెసింగ్ ఎడ్యుకేషన్" అంటూ ఓ ట్వీట్‌లో విమర్శించారు. విద్యావిధానం అణచివేతకు గురవుతుందనే అభిప్రాయాన్ని ఆ ట్వీట్‌లో వ్యక్తం చేశారు. 10, 12 తరగతుల సిలబస్‌లో సీబీఎస్‌సీ మార్పులు చేయడంతో రాహుల్ తాజా వ్యాఖ్యలు చేశారు. సిలబస్ మార్పులపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను టార్గెట్ చేసుకుంటూ దీనిని "రాష్ట్రీయ శిక్షా శ్రేడర్"గా అభివర్ణించారు. తన అఫీషియల్ ట్విట్టర్ ఖాతాలో ఆయన ఈ ట్వీట్ చేస్తూ, పలు అంశాలను ముక్కలుగా చేస్తున్నట్టు చూపించే 'షెడ్రింగ్ మిషన్' ఫోటోను జోడించారు. ప్రజాస్వామ్యం, వైవిధ్యం, వ్యవసాయంపై గ్లోబలైజేషన్ ప్రభావం, అలీన విధానం, ది మొఘల్ కోర్ట్, పారిశ్రామిక విప్లవం, ఫయిజ్ పోయిమ్స్, ఎంప్లాయిమెంట్, మతసామరస్యం, వ్యవస్థలు వంటి అంశాలను షెడ్రింగ్ మిషన్ చిన్న చిన్న ముక్కలుగా కట్ చేస్తున్నట్టు ఈ ఇమేజ్ ఉంది.

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఇటీవల 10, 11, 12 తరగతుల సిలబస్ నుంచి కొన్ని పాఠాలను తొలగించింది. 11, 12 తరగతుల సిలబస్ నుంచి అలీనోద్యమం, ప్రచ్ఛన్న యుద్ధ శకం, ఆఫ్రో-ఆసియన్ ప్రాంతాల్లో ఇస్లామిక్ రాజ్యాల ఎదుగుదల, మొఘలు కోర్టులు, పారిశ్రామిక విప్లవం అధ్యాయాలను ఉపసంహరించింది. చరిత్ర, రాజనీతి శాస్త్రం నుంచి వీటిని తొలగించింది. పదకొండవ తరగతిలోని చరిత్ర పుస్తకంలో 'సెంట్రల్ ఇస్లామిక్ ల్యాండ్స్' అధ్యాయంలో ఆఫ్రో-ఆసియన్ టెరిటరీస్‌లో ఇస్లామిక్ రాజ్యాలు, ఆర్థిక వ్యవస్థ, సమాజంపై వాటి ప్రభావం గురించి వివరించారు. ఈ అధ్యాయాన్ని సిలబస్ నుంచి తాజాగా తొలగించారు.



దేశంలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించే వాతావరణాన్ని నిర్మించాలి : ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:భారతదేశంలో క్రీడాసంస్కృతిని పెంపొందించేందుకు ప్రత్యేకమైన కృషి జరగాల్సిన అవసరం ఉందని గౌరవ భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. క్రీడలను జీవనోపాధి మార్గంగా ఎంచుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన వాతావరణాన్ని నిర్మించాలని ఆయన సూచించారు. ఈ ప్రయత్నంలో పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు ప్రత్యేకమైన విభాగాలను ఏర్పాటుచేసి క్రీడావ్యవస్థలను బలోపేతం చేసే దిశగా ప్రయత్నాన్ని ప్రారంభించాలని ఉపరాష్ట్రపతి అన్నారు.

ఆదివారం బెంగళూరులో 'ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడలు - 2021'ను ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా దాదాపు 200 విశ్వవిద్యాలయాలనుంచి వచ్చిన 4500 మంది యువ క్రీడాకారులను, క్రీడా ప్రముఖులు, ప్రైవేటు రంగం ప్రతినిధులు, ప్రభుత్వాధికారులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ.. విదేశాల్లో మరీ ముఖ్యంగా అమెరికా వంటి దేశాల్లో క్రీడలకు విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలో ఇస్తున్న ప్రాధాన్యత, ప్రోత్సాహం ఒలింపిక్స్ లో ఆ దేశం సాధిస్తున్న పతకాల పట్టికలో కనబడుతోందన్నారు. ఇదే విధంగా మన దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు కూడా క్రీడాసంస్కృతిని ప్రోత్సహిస్తూ, వివిధ క్రీడల్లో అవసరమైన మౌలికవసతుల కల్పన ద్వారా పోటీతత్వాన్ని పెంచేందుకు ప్రయత్నించాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషికి ప్రైవేటు రంగం, సామాజికవేత్తలు, ప్రముఖ క్రీడాకారులు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. క్రీడా మౌలికవసతుల నిర్మాణంతోపాటు సామర్థ్యమున్న క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించడం, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో ముందుండాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి సూచించారు. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాసామర్థ్యాన్ని వెలికితీసి సానబెట్టాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు.

ఈ దిశగా కేంద్రం 'ఖేలో ఇండియా' పేరుతో చేపట్టిన కార్యక్రమం ఓ అద్భుతమైన ఆలోచన అన్న ఉపరాష్ట్రపతి.. ఈ కార్యక్రమం ద్వారా క్రీడాకారుల్లోని సామర్థ్యాన్ని గుర్తించడం, ప్రోత్సహించడం, అవసరమైన వసతుల కల్పన ద్వారా ప్రపంచ క్రీడాయవనికపై భారతదేశ కీర్తిపతాకను రెపరెపలాడించేలా చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు.

యోగాసనాలు, మల్లఖంబ వంటి దేశీయ క్రీడలతోపాటు 20 రకాల వివిధ క్రీడల్లో ఈసారి ఖేలో ఇండియా పోటీల్లో నిర్వహిస్తుండటాన్ని అభినందించిన ఉపరాష్ట్రపతి.. భారతీయ క్రీడలను ముఖ్యంగా గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. గ్రామీణ క్రీడల్లోనే మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని ఆయన పేర్కొన్నారు.

క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక సంతులనం పెరుగుతుందన్న ఉపరాష్ట్రపతి.. క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పెంపొందించుకోవడం ద్వారా ఏ రంగంలోనైనా ఉత్తమఫలితాలు సాధించవచ్చన్నారు. ఆరోగ్యకరమైన పోటీలో భాగస్వాములయ్యేందుకు క్రీడలు వ్యక్తిగతంగా ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. అందుకే క్రీడలు, యోగా ను పాఠశాలల పాఠ్యప్రణాళికలో చేర్చడం ద్వారా బాల్యం నుంచే విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, శారీరక, మానసిక సంతులనం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి వంటివి పెంపొందించవచ్చన్నారు. నూతన జాతీయ విద్యావిధానం ? 2020 కూడా ఈ దిశగా వినూత్నమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు.

ప్లాస్టిక్ వినియోగం లేకుండా, పునర్వినియోగ వస్తువులను వినియోగించడం కారణంగా ఈ క్రీడలు మొట్టమొదటి గ్రీన్ గేమ్స్ గా నిలిచిపోతాయని ఉపరాష్ట్రపతి అన్నారు. ఇందుకుగానూ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమ సహ నిర్వాహకులు జైన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ యాజమాన్యాన్ని కూడా ఆయన అభినందించారు. క్రీడా సౌకర్యాలను మెరుగుపరచడం, క్రీడాకారులను ప్రోత్సహించడంలో వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ శ్రీ థావర్ చంద్ గెహ్లోత్, ముఖ్యమంత్రి శ్రీ బసవరాజ బొమ్మై, కేంద్ర మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్, కర్ణాటక రాష్ట్ర మంత్రి డాక్టర్ కేసీ నారాయణ గౌడ, పలువురు ప్రముఖులు, అధికారులు, క్రీడాకారులు, క్రీడా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'ఖేలో ఇండియా' విశ్వవిద్యాలయ క్రీడల ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రి సందేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ 'ఖేలో ఇండియా' విశ్వవిద్యాలయ క్రీడల ప్రారంభోత్సవం సందర్భంగా తన సందేశాన్ని ప్రజలతో పంచుకున్నారు. బెంగళూరులో నిర్వహిస్తున్న ఈ క్రీడలను భారత ఉప రాష్ట్రపతి శ్రీ ఎం.వెంకయ్య నాయుడు ఈ రోజు ప్రారంభించారు. కర్ణాటక గవర్నర్ శ్రీ థావర్ చంద్ గెహ్లోట్, దేశీయాంగ శాఖ మంత్రి శ్రీ అమిత్ షా, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బసవరాజ్ బొమ్మై, కేంద్ర ఆర్థిక-కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్, కేంద్ర యువజన వ్యవహారాలు-క్రీడలశాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్‌తోపాటు సహాయ మంత్రి శ్రీ నిసిత్ ప్రమాణిక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.దేశంలోని యువజనోత్సాహానికే బెంగళూరు ప్రతీక కాగా, వృత్తి నిపుణులకు గర్వకారణమైన నగరమని ఈ సందర్భంగా ప్రధాని అభివర్ణించారు. అంకుర సంస్థలు, క్రీడల సమ్మేళనం ఇవాళ ఇక్కడ సాకారం కావడం విశేషమని పేర్కొన్నారు. "బెంగళూరులో 'ఖేలో ఇండియా' విశ్వవిద్యాలయ క్రీడల నిర్వహణ ఈ సుందర నగరానికి మరింత శక్తినిస్తుంది" అని ఆయన అన్నారు. మహమ్మారి సవాళ్ల మధ్య క్రీడలు నిర్వహించడాన్ని నిర్వాహకుల దృఢ సంకల్పం, అభిరుచికి ప్రతీకగా ప్రధాని వర్ణిస్తూ వారికి అభివందనం చేశారు. ఈ యువజనోత్సాహం భారతదేశాన్ని ప్రతి రంగంలోనూ కొత్త ఊపుతో నడిపిస్తోందని ప్రధానమంత్రి చెప్పారు.

విజయానికి తొలి తారకమంత్రం జట్టు స్ఫూర్తేనని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. "క్రీడల ద్వారానే ఈ జట్టు స్ఫూర్తిని మనం అలవరచుకుంటాం. ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడల్లో ఇది నేరుగా మీ అనుభవంలోకి వస్తుంది. ఈ జట్టు స్ఫూర్తి జీవితంపట్ల సరికొత్త దృక్పథాన్ని ఏర్పరస్తుంది" అని ప్రధాని వ్యాఖ్యానించారు. అదేవిధంగా జీవితంలోనూ, క్రీడల్లోనూ విజయానికి సమగ్ర విధానంతోపాటు 100 శాతం అంకితభావం ప్రధాన అవసరాలని ఆయన పేర్కొన్నారు. క్రీడా రంగంలో మన బలాలు, మనం నేర్చుకునే పాఠాలు మనను ముందుకు నడిపిస్తాయని చెప్పారు. "వాస్తవానికి క్రీడలంటే- జీవితానికి అసలైన అందదండగా నిలిచే వ్యవస్థ" అని శ్రీ మోదీ నొక్కిచెప్పారు. అభిరుచి, సవాళ్లు, ఓటమి నుంచి పాఠాలు, నిబద్ధత, వర్తమానంలో చైతన్య సామర్థ్యం వంటి వివిధ అంశాల రీత్యా క్రీడలకు, జీవితానికిగల సారూప్యాన్ని ప్రధానమంత్రి విశదీకరించారు. "విజయాన్ని ఆస్వాదించడం, ఓటమి నుంచి పాఠాలు క్రీడా రంగంలో మనం నేర్చుకునే ముఖ్యమైన కళలు" అని ఆయన అభివర్ణించారు.

క్రీడాకారులు నవభారత యువజనం మాత్రమేగాక 'ఐక్య భారతం-శ్రేష్ఠ భారతం' పతాకధారులని ప్రధానమంత్రి చెప్పారు. యువోత్సాహ ఆలోచన ధోరణి, పద్ధతులు నేడు దేశ వివిధవిధానాలకు రూపుదిద్దుతున్నాయని చెప్పారు. దేశ ప్రగతికి శరీర దారుఢ్యాన్ని మన యువత ఒక మంత్రంగా మార్చుకున్నారని ప్రధాని అన్నారు. అనేక కార్యక్రమాలు పాతకాలపు మూస ఆలోచన ధోరణి నుంచి క్రీడలను విముక్తం చేస్తున్నాయని చెప్పారు. కొత్త విద్యా విధానంలో క్రీడలకు ప్రాధాన్యం, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన, పారదర్శక ఎంపిక ప్రక్రియ లేదా క్రీడల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెంపు వంటి చర్యలు నవ భారతానికి ప్రతీకగా మారాయి. అలాగే యువతరం ఆశలు, ఆకాంక్షలు నవ భారత నిర్మాణం దిశగా నిర్ణయాలకు పునాదిగా ఉన్నాయన్నారు. "నేడు దేశంలో కొత్త క్రీడా విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ప్రత్యేక క్రీడా విశ్వవిద్యాలయాలు రానున్నాయి. ఇదంతా మీ సౌలభ్యం కోసమేగాక మీ కలలను నెరవేర్చుకోవడం కోసమే" అని ప్రధానమంత్రి అన్నారు.

క్రీడలలో గుర్తింపు దేశానికి మరింత గుర్తింపు తెస్తుంది కాబట్టి క్రీడాశక్తి, దేశం సామర్థ్యాలకు మధ్య అవినాభావ సంబంధం ఉందని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా టోక్యో ఒలింపిక్స్ బృందంతో తన సమావేశాన్ని గుర్తుచేసుకుంటూ- దేశం కోసం ఎంతోకొంత సాధించామన్న ఆనందం, సంతృప్తి వారి వదనాల్లో మెరిశాయని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొంటూనే దేశం కోసం ఆడాల్సిందిగా క్రీడాకారులకు ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

ఇండియా విశ్వవిద్యాలయాల క్రీడల పోటీల్లో పాల్గొనేందుకు బెంగళూరు వచ్చిన వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో మాట్లాడిన శ్రీ అనురాజ్ ఠాకూర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:ఖేలో ఇండియా విశ్వవిద్యాలయాల క్రీడల పోటీలు జరగనున్న జైన్ యూనివర్సిటీ గ్లోబల్ క్యాంపస్ ను కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్ ఆకస్మికంగా సందర్శించారు, కొత్తగా చేర్చిన మల్లకుంబ మరియు యోగాసనాలతో సహా 13 విభాగాలలో పోటీలు జరగనున్నాయి.

స్వతహాగా అథ్లెటిక్ అయిన క్రీడల శాఖ మంత్రి పోటీలు జరగనున్న వివిధ ప్రాంగణాలను సందర్శించి వాటిలో కల్పిస్తున్న సౌకర్యాలను స్వయంగా తెలుసుకున్నారు. పోటీల్లో పాల్గొంటున్న వారు తీపి గుర్తులతో వెళ్లే విధంగా కేయూజి 2021 నిర్వహించాలని ఆయన అన్నారు. క్రికెటర్ గా తన అనుభవాలను మంత్రి గుర్తు చేసుకున్నారు. '' ఖేలో ఇండియా విశ్వవిద్యాలయాల క్రీడల పోటీలు నిర్వహించేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి జైన్ యూనివర్సిటీ అత్యుత్తమ ఏర్పాట్లు చేస్తోంది. ఇక్కడ క్రీడాకారులను చూసిన తర్వాత నాకు నేను విశ్వవిద్యాలయంలో చదువుతున్న సమయంలో క్రికెట్ ఆడిన రోజులు గుర్తు వస్తున్నాయి. బిహార్‌లోని దర్భంగా మరియు సమస్తిపూర్ వంటి ప్రదేశాలలో జరిగిన కొన్ని టోర్నమెంట్‌లు జరిగాయి. అయితే,సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ప్రస్తుతం దేశంలో క్రీడా సౌకర్యాలు మెరుగు పడ్డాయి. ఇక్కడ క్రీడాకారులకు అత్యుతమ సౌకర్యాలను కల్పిస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాల మేరకు కేయూజి 2021 పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాము.'' అని శ్రీ అనురాగ్ ఠాకూర్ అన్నారు.

"క్రీడా స్ఫూర్తితో ఆడండి. పరిశుభ్రమైన క్రీడలను ప్రచారం చేయండి. ప్రతిభ కనబరిచేందుకు డ్రగ్స్‌ని ఉపయోగించవద్దు." అని వర్ధమాన అథ్లెట్లకు శ్రీ ఠాకూర్ సలహా ఇచ్చారు. అందుకే అథ్లెట్లకు సరైన సమాచారం అందించడానికి మేము నాడా ద్వారా కృషి చేస్తున్నామని మంత్రి వివరించారు. విశ్వవిద్యాలయ స్థాయిలో యువ క్రీడాకారులకు డోపింగ్ గురించి మరింత అవగాహన కల్పించాల్సి ఉంటుందని మంత్రి అన్నారు.

వివిధ విశ్వవిద్యాలయాల నుంచి క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన వారితో మంత్రి మాట్లాడారు. వారు పాల్గొంటున్న ఈవెంట్‌లు మరియు క్రీడల వివరాలను మంత్రి తెలుసుకున్న శ్రీ ఠాకూర్ వారి ఆశయాల అడిగి తెలుసుకున్నారు.

శ్రీ అనురాగ్ ఠాకూర్ తో ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం వాలీ బాల్ బృందం సభ్యుడిగా ఉన్న ఎస్. సంతోష్ మాట్లాడారు. దీనిపై మాట్లాడిన సంతోష్ " క్రీడల శాఖ మంత్రితో మాట్లాడడం ఎంతో ఆనందంగా ఉంది. రాష్ట్రం మరియు విశ్వవిద్యాలయాల కోసం కష్టపడి ఆడుతూనే ఉండాలి అని ఆయన మమ్మల్ని ప్రోత్సహించారు. మంత్రి స్వయంగా మా వద్దకు వచ్చి మా క్రీడల గురించి మాట్లాడి మాకు క్రీడా స్ఫూర్తి కల్పించారు. అథ్లెట్‌తో కలిసి ఒక సీనియర్ మంత్రి మైదానంలో ఉండడం చాలా అరుదుగా జరుగుతుంది. ఈ రోజు మాకు కలిగిన అనుభవం కలకాలం గుర్తుండి పోతుంది" అని అన్నారు.

మహిళల విభాగంలో హెచ్ఆర్ఎం(హిమాచల్ ప్రదేశ్ యూనివర్సిటీ), ఏడబ్ల్యూయూ (అడమస్ యూనివర్శిటీ వెస్ట్ బెంగాల్), పురుషుల విభాగంలో ఎస్ఆర్ఎం యూనివర్శిటీ చెన్నై, ఏడబ్ల్యూయూ జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో క్రీడా మంత్రి ఉదయం వాలీబాల్ వేదిక వద్దకు వచ్చారు. అతను రెండు జట్ల సభ్యులతో మాట్లాడి రాబోయే మ్యాచ్‌లలో విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు . రిఫరీలు, ప్రేక్షకులతో కూడా మంత్రి మాట్లాడారు. అంతే కాకుండా శ్రీ ఠాకూర్ ఒక రౌండ్ వాలీబాల్ ఆడారు

బొంబాయి హైకోర్టులో ఎంపీ నవనీత్ కౌర్ దంపతులకి చుక్కెదురు

బొంబాయి,ఏప్రిల్ 25: బొంబాయి హైకోర్టులో ఎంపీ నవనీత్

ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ శ్రీ అనురాగ్ జయంతి

-ఎండాకాలం దృష్ట్యా విద్యార్థులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి):జిల్లాలో జరుగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.

పరీక్షలకు ప్రారంభం ముందే ప్రతి పరీక్ష కేంద్రాన్ని డీఐ ఈఓ డీఈఓ ,లు సందర్శించి త్రాగునీరు, విద్యుత్, ఫ్యాన్ లు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఉన్నాయో లేవో పరిశీలించాలని అన్నారు. ఇంకా ఏమైనా సౌకర్యాలు చేపట్టాల్సి ఉంటే వెంటనే సంబంధిత శాఖల అధికారులతో పనులు చేపట్టాలని అన్నారు.

సోమవారం ఐ డిఓసీ మినీ మీటింగ్ హాల్ లో సమావేశ మందిరంలో ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పరీక్షలు మే 23వ తేదీ నుంచి ,జూన్ 1వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలవరకు జరుగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 35 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని అందులో 6,379 మంది రెగ్యులర్ విద్యార్థులు, 5 మంది ప్రైవేట్ గా విద్యార్థులు, మొత్తం 6,382 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

ఎండాకాలం దృష్ట్యా విద్యార్థులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించాలని ఆయన ఆదేశించారు.

ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల కేంద్రాలలో మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసేందుకు రెవెన్యూ అధికారులను ఫ్లయింగ్ స్క్వాడ్‌లుగా నియమించాలని అన్నారు. తహశీల్దార్ లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 141 సెక్షన్ అమలయ్యేలా చూడాలన్నారు.పదోతరగతి పరీక్ష పత్రాలను జిల్లా ట్రెజరీలో భద్రపర్చాలని, తగిన పోలీసు బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు రవాణా చేయాలని ఆదేశించారు.

పరీక్ష కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలని, 108 వాహనాలను వినియోగించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిని ఆదేశించారు. పది, ఇంటర్ పరీక్షలు పూర్తి అయ్యేంతవరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సెస్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు పరీక్షకేంద్రాలకు సకాలంలో వచ్చి వెళ్లడానికి వీలుగా బస్సులను పరీక్ష కేంద్రాల రూటులో నడిపించాలని ఆర్టీసీ అధికారులని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షల సమయానికి గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

-మే 6 నుంచి ఇంటర్ పరీక్షలు

జిల్లాలో ఇంటర్మీడియట్ రాత పరీక్షలు మే 6 నుంచి మే 24 వరకు ఉదయం 9 గంటల ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 4,474 మంది, రెండో సంవత్సరం 4,462 మంది మొత్తం 8,936 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలో 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని 8 పోలీస్ స్టేషన్లో పశ్న పత్రావలి భద్ర పరుస్తామని తెలిపారు. ఇక ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక సిట్టింగ్ స్క్వాడ్, 2 కస్తోడియన్ పాయింట్స్ రెండు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కు అధికారులు తెలిపారుసమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈఓ డి రాధా కిషన్, డీఐ ఈవో మోహన్, డి టి ఓ శ్రీమతి నీరజ, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట

-ధ్యానంతో మానసిక ప్రశాంతత

రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

నందిగామ మండలం కన్హలో

12 పడకల కన్హ మెడికల్ సెంటర్ ప్రారంభం



నందిగామ, ఏప్రిల్ 25: విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హశాంతి వనంలో నూతనంగా ఏర్పాటు చేసిన 12 పడకల కన్హ మెడికల్ సెంటర్‌ను మంత్రి హరీశ్‌రావు ఆదివారం శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ గురూజీ కమలేశ్ డీ పటేల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు 24 గంటలు ఉచితంగా మెరుగైన వైద్య సేవలందించేందుకు కన్హశాంతి వనంలో అన్ని రకాల అత్యాధునిక వైద్య పరికరాలతో కన్హ మెడికల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు కన్హ మెడికల్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

కన్హ మెడికల్ సెంటర్‌కు ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సాయం అందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన విధానానికి అనుగుణంగా కన్హశాంతి వనంలో మూడు లక్షలకు పైగా మొక్కలు నాటడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం మన రాష్ట్రంలో ఉండటం మన ప్రాంతం అదృష్టమని పేర్కొన్నారు. నేడు ఉరుకులు పరుగుల జీవితంగా మనుషులు ప్రశాంతత కోల్పోయి ఒత్తిడికి గురవుతున్నారని, ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని జీవితంలో భాగంగా చేసుకుని ప్రతి రోజు ధ్యానం, యోగా చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కోల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, కేశంపేట ఎంపీపీ వై.రవీందర్‌యాదవ్, నందిగామ ఎంపీపీ ప్రియాంక గౌడ్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కన్హ గ్రామ సర్పంచ్ సరిత, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో.. 4జి సేవలు

హైదరాబాద్, ఏప్రిల్ 25:వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల్లో 4జీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు ఉపయోగిస్తున్న 2జీ టెక్నాలజీ సేవలతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నందున 4జీని ఉపయోగిస్తూ రేషన్ దుకాణాలను డిజిటలీకరణ చేయనున్నారు. బ్లూ టూత్ సాయంతో ఈ పాస్ యంత్రాలు (బయోమెట్రిక్), తూకం వేసే యంత్రాన్ని అనుసంధానం చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు వంద శాతం పక్కాగా ప్రభుత్వం అందించే రేషన్ అందనున్నది. హైదరాబాద్‌లో 668 రేషన్ దుకాణాలు ఉండగా, దాదాపు అన్ని దుకాణాలకు జిల్లా పౌరసరఫరాల అధికారులు కొత్త యంత్రాలను పంపిణీ చేశారు.రేషన్ పంపిణీలో పలు సమస్యలు తలెత్తుతున్నందున ప్రభుత్వం 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నది. ఇప్పటివరకు తూనికల్లో హెచ్చు, తగ్గులు ఉన్నాయనే ఆరోపణలు రావడం, బయోమెట్రిక్ నిదానంగా పనిచేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు పెరిగిపోవడంతో ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.ఇప్పటి వరకు ఈపాస్ యంత్రం, తూనికల యంత్రం వేరు వేరుగా ఉండేది. లబ్ధిదారుల నిర్ధారణ పూర్తయిన తరువాత వారికి రేషన్ అందించేవారు. కొత్త టెక్నాలజీలో ఈపాస్ యంత్రానికి, తూనికల యంత్రం అనుసంధానమై ఉంటుంది. లబ్ధిదారుడు వేలి ముద్ర ద్వారా నిర్ధారణ అయిన వెంటనే బ్లూటూత్‌తో తూనికల యంత్రానికి సిగ్నల్స్ వెళ్తాయి. లబ్ధిదారుడి కుటుంబంలో ఎంత మంది ఉన్నారు,

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు జమ్మూ, కాశ్మీర్‌ను సందర్శించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు జమ్మూ-కశ్మీర్ లో పర్యటించి, దేశవ్యాప్తంగా అన్ని గ్రామసభలను ఉద్దేశించి ప్రసంగించారు. సాంబ జిల్లా లోని పల్లి పంచాయతీ ని ఆయన సందర్శించారు. దాదాపు 20,000 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అమృత్ సరోవర్ కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో, జమ్మూ-కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా, కేంద్ర మంత్రులు శ్రీ గిరిరాజ్ సింగ్, డాక్టర్ జితేంద్ర సింగ్, శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ ప్రభృతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ, జమ్మూ-కశ్మీర్ అభివృద్ధి ప్రయాణంలో ఈరోజు ఒక మైలురాయి అని అభివర్ణించారు. జమ్మూ-కశ్మీర్ ప్రజల ఉత్సాహానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంతో తనకున్న సుదీర్ఘ అనుబంధం కారణంగా, వాటిలో ఇమిడి ఉన్న సమస్యలను తాను అర్థం చేసుకున్నాననీ, ఈ రోజు శంకుస్థాపన చేసిన, ప్రారంభించిన ప్రాజెక్టులలో కనెక్టివిటీ పై దృష్టి పెట్టడం పట్ల తాను సంతోషం వ్యక్తం చేస్తున్నాననీ, ప్రధానమంత్రి చెప్పారు. "ఇక్కడ కనెక్టివిటీ మరియు విద్యుత్ కు సంబంధించి 20 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయి. జమ్మూ-కశ్మీర్ అభివృద్ధికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చేలా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రయత్నాలు జమ్మూ-కశ్మీర్ లోని పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి కల్పిస్తాయి" అని ఆయన అన్నారు. ఈ రోజు చాలా కుటుంబాలు గ్రామాల్లో తమ ఇళ్లకు సంబంధించిన ఆస్తి కార్డులు కూడా పొందాయి. ఈ యాజమాన్య కార్డులు గ్రామాల్లో కొత్త అవకాశాలకు ఊతమిస్తాయి. జమ్మూ-కశ్మీర్ లోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు సరసమైన మందులు, శస్త్రచికిత్స వస్తువులు అందించడానికి, 100 జన్-ఔషధి కేంద్రాలు, ఒక మాధ్యమంగా పనిచేస్తాయని, ఆయన చెప్పారు. జమ్మూ-కశ్మీర్ లో కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ అమలవుతున్నాయని, వాటి ద్వారా ప్రజలు లబ్ధి పొందుతున్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఎల్.పి.జి., మరుగుదొడ్లు, విద్యుత్, భూమి హక్కులు, నీటి కనెక్షన్ లకు సంబంధించిన పథకాల వల్ల గ్రామాల్లోని ప్రజలు అత్యధికంగా లబ్ధి పొందుతున్నారు. వేదిక వద్దకు చేరుకోవడానికి ముందు, ప్రధానమంత్రి యు.ఎ.ఈ. నుండి వచ్చిన ప్రతినిధులతో సమావేశమయ్యారు. జమ్మూ-కశ్మీర్ పై చాలా మంది ప్రయివేటు పెట్టుబడిదారులు ఆసక్తి కనబరుస్తున్నారని, అభివృద్ధికి కొత్త రూపకల్పన చేస్తున్నారని, ప్రధానమంత్రి పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 7 దశాబ్దాలలో జమ్మూ-కశ్మీర్ లో కేవలం 17 వేల కోట్ల రూపాయల మేర ప్రైవేటు పెట్టుబడులు పెట్టడం జరిగింది. అయితే, ఇప్పుడు అవి, దాదాపు 38,000 కోట్ల రూపాయలకు చేరుకుంటున్నాయి. పర్యాటక రంగం కూడా మరోసారి అభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి వివరించారు.

జమ్మూ-కశ్మీర్ లో మారిన పని విధానాన్ని ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా పేర్కొంటూ, మూడు వారాల్లో ఏర్పాటు చేయనున్న 500 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంటు ను ఉదాహరణగా చెప్పారు. ఇంతకు ముందు ఢిల్లీ నుంచి ఫైళ్ల తరలింపు కే 2, 3 వారాలు పట్టేదని ఆయన అన్నారు. పల్లి పంచాయతీలో అన్ని ఇళ్లకు సోలార్ విద్యుత్ అందడం గ్రామ ఊర్జ స్వరాజ్యానికి నిలువెత్తు ఉదాహరణ అని పేర్కొంటూ, మారిన పని విధానం జమ్మూ-కశ్మీర్ ను నూతన శిఖరాలకు చేరుస్తుందని అన్నారు. జమ్మూ యువతకు ప్రధానమంత్రి హామీ ఇస్తూ, "మిత్రులారా, నా మాటలు నమ్మండి. ఈ లోయకు చెందిన యువతీ యువకులు నా మాటలు గుర్తించండి, మీ తల్లిదండ్రులు, తాత ముత్తాతలు ఎదుర్కొన్న ఇబ్బందులు మీరు ఎదుర్కోవలసిన అవసరం లేదు. ఇది నేను నెరవేరుస్తాను. దాని గురించి మీకు హామీ ఇవ్వడానికి నేను వచ్చాను.'' అని పేర్కొన్నారు.

అంతర్జాతీయ పర్యావరణ, వాతావరణ మార్పుల వేదికలపై భారతదేశ నాయకత్వాన్ని శ్రీ మోదీ ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, మొదటి కర్బన రహిత పంచాయతీగా వల్లి పంచాయతీ అవతరిస్తున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. "పల్లి పంచాయతీ దేశంలోనే తొలి కర్బన రహిత పంచాయతీగా అవతరిస్తోంది. ఈ రోజు పల్లి గ్రామం నుంచి, దేశంలోని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులతో మమేకమయ్యే అవకాశం కూడా నాకు లభించింది. ఈ గొప్ప విజయం మరియు అభివృద్ధి పనులకు జమ్మూ-కశ్మీర్ కు అనేక అభినందనలు" అని ఆయన అన్నారు.

''జమ్మూ-కశ్మీర్ లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకోవడం ఒక పెద్ద మార్పును సూచిస్తుంది" అని ప్రధానమంత్రి అన్నారు. జమ్మూ-కశ్మీర్ లో ప్రజాస్వామ్యం క్షేత్ర స్థాయి నుంచి అమలౌతున్నందుకు శ్రీ మోదీ గొప్ప సంతృప్తి మరియు గర్వాన్ని వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్యం కావచ్చు లేదా అభివృద్ధి కోసం సంకల్పం కావచ్చు, ఈ రోజు జమ్మూ-కశ్మీర్ ఒక కొత్త ఉదాహరణగా నిలిచింది. గత 2, 3 సంవత్సరాలలో, జమ్మూ-కశ్మీర్ లో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది", అని ప్రధానమంత్రి ప్రత్యేకంగా పేర్కొన్నారు. జమ్మూ-కశ్మీర్ లో తొలిసారిగా మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థకు - గ్రామ పంచాయతీ, పంచాయతీ సమితి, డి.డి.సి. ఎన్నికలు జరిగాయి.

దేశ అభివృద్ధి ప్రయాణంలో జమ్మూ-కశ్మీర్‌ను చేర్చే ప్రక్రియ గురించి ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, జమ్మూ-కశ్మీర్ లో 175 కంటే ఎక్కువ కేంద్ర చట్టాలు వర్తిస్తాయని తెలియజేశారు. ఈ ప్రాంతంలోని మహిళలు, నిరుపేదలు, అణగారిన వర్గాల ప్రజలే దీని ద్వారా అత్యధికంగా లబ్ధి పొందుతున్నారు. రిజర్వేషన్ నిబంధనల్లోని అవకతవకలను తొలగించడంపై కూడా ఆయన మాట్లాడారు. ''వాల్మీకి సమాజం దశాబ్దాలుగా వారి పాదాలకు బంధించిన సంకెళ్ల నుండి విముక్తి పొందింది. ఈ రోజున ప్రతి సమాజంలోని కుమారులు, కుమార్తెలు తమ కలలను నెరవేర్చుకోగలుగుతున్నారు. జమ్మూ-కశ్మీర్ లో ఏళ్ల తరబడి రిజర్వేషన్ల ప్రయోజనం పొందని వారు, ఇప్పుడు రిజర్వేషన్ల ప్రయోజనం పొందుతున్నారు" అని ఆయన వివరించారు.

తమ 'ఏక్-భారత్-శ్రేష్ఠ్-భారత్' దార్శనికత గురించి ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, అనుసంధానత , దూరాల తొలగింపు పై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు వివరించారు. "దూరాలు, హృదయాలు, భాషలు, వనరులు, ఆచారాలు మొదలైన వాటి నిర్మూలన ఈ రోజు మనకు చాలా పెద్ద ప్రాధాన్యత" అని ఆయన చెప్పారు.

దేశాభివృద్ధిలో పంచాయతీల పాత్ర గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, "ఈ స్వాతంత్ర్య 'అమృత్ కాల్' భారతదేశానికి స్వర్ణ కాలం కానుంది. ఈ సంకల్పం 'సబ్-కా-ప్రయాస్' ద్వారా సాకారం కానుంది. ఇందులో ప్రజాస్వామ్యంలోని క్షేత్ర స్థాయి యూనిట్ అయిన గ్రామ పంచాయతీ పాత్రతో పాటు, మీ అందరి సహచరుల పాత్ర చాలా ముఖ్యమైనది" అని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రతి ప్రాజెక్టు ప్రణాళిక రూపకల్పన, అమలులో పంచాయతీ పాత్ర మరింత లోతుగా ఉండాలని ప్రభుత్వం కృషిచేస్తోందని, ఆయన నొక్కి చెప్పారు. "దీనితో, జాతీయ తీర్మానాల సాధనలో పంచాయతీ ఒక ముఖ్యమైన అనుసంధానకర్తగా ఉద్భవిస్తుంది" అని ఆయన అన్నారు. 2023 ఆగష్టు, 15వ తేదీ నాటికి ప్రతి జిల్లాలో 75 జలాశయాలు రానున్నాయని, ప్రధానమంత్రి చెప్పారు. ఈ సరోవరాల చుట్టుపక్కల అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధుల పేర్లతో చెట్లను పెంచాలని, ఆయన కోరారు. గ్రామ పంచాయితీల పారదర్శకత, సాధికారత గురించి కూడా శ్రీ మోదీ విశదీకరించారు. ప్రణాళిక నుండి చెల్లింపు వరకు ప్రక్రియలను ఈ-గ్రామ స్వరాజ్ వంటి చర్యలు అనుసంధానం చేస్తున్నాయి. పంచాయతీల కార్యకలాపాలను ఆన్ లైన్ తనిఖీ చేయడం జరుగుతుంది. అదేవిధంగా సభలు అనేక కార్యక్రలాపాలు నిర్వహించడానికి పౌర చార్టర్ వ్యవస్థ గ్రామ సభలను ప్రోత్సహిస్తోంది. ఈ సంస్థలతో పాటు, గ్రామ పాలనలో ముఖ్యంగా నీటి పాలనలో మహిళల పాత్రను కూడా ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు.

సహజ వ్యవసాయం కోసం తమ ఆకాంక్షను ప్రధానమంత్రి పునరుద్ఘాటిస్తూ, భూమి, భూగర్భ జలాలకు హాని కలిగిస్తున్నన రసాయనాల నుండి భూమాతను పరిరక్షించడం చాలా కీలకమని సూచించారు. మన గ్రామాలు సహజ వ్యవసాయం వైపు పయనిస్తే యావత్ మానవాళికి మేలు జరుగుతుందని, ఆయన అన్నారు. గ్రామ పంచాయతీల స్థాయిలో సహజ వ్యవసాయాన్ని ఎలా ప్రోత్సహించవచ్చో అన్వేషించాలని, ఇందుకు సమిష్టి కృషి అవసరమని ఆయన సూచించారు. అదేవిధంగా, 'సబ్-కా-ప్రయాస్' సహాయంతో పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడంలో గ్రామ పంచాయతీలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. "పోషకాహార లోపం, రక్తహీనత నుండి దేశాన్ని రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న చర్యల గురించి క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇప్పుడు ప్రభుత్వ పథకాల కింద ఇస్తున్న బియ్యం నరఖరాను మరింత పటిష్టపరుస్తున్నాము.'' అని ఆయన తెలియజేశారు.

ఆగష్టు 2019 లో జమ్మూ-కశ్మీర్ కి సంబంధించి రాజ్యాంగ సంస్కరణలను ప్రవేశపెట్టినప్పటి నుండి, అపూర్వమైన వేగంతో ఈ ప్రాంతంలోని ప్రజల జీవన సౌలభ్యాన్ని పెంపొందించడానికి, పాలనను గణనీయంగా మెరుగుపరచడానికి, విస్తృత శ్రేణి సంస్కరణలను తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ రోజు ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు ప్రాథమిక సౌకర్యాలను అందించడంలో, ఈ ప్రాంతంలో చైతన్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధిని సులభతరం చేయడంలో ఎంతో ఉపయోగపడతాయి.

3100 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో నిర్మించిన బనిహాల్ ఖాజిగుండ్ రోడ్ టన్నెల్ ను ప్రధానమంత్రి ప్రారంభించారు. 8.45 కి.మీ. పొడవైన ఈ సొరంగం బనిహాల్ - ఖాజిగుండ్ మధ్య రహదారి దూరాన్ని 16 కి.మీ తగ్గిస్తుంది, ప్రయాణ సమయం సుమారు గంటన్నర తగ్గుతుంది. ప్రయాణం యొక్క ప్రతి దిశకు ఒకటి చొప్పున - ఇది రెండు గొట్టపు మార్గాలతో ఉన్న సొరంగం - నిర్వహణ మరియు అత్యవసర తరలింపు కోసం ప్రతి 500 మీటర్లకు ఒక చోట ఒక మార్గం నుంచి రెండో మార్గంలోకి వెళ్ళడానికి వీలుగా రెండు గొట్టాలు ఒకదానితో ఒకటి అనుసంధానించబడి ఉంటాయి. ఈ సొరంగం జమ్మూ-కశ్మీర్ మధ్య అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ, రెండు ప్రాంతాలను దగ్గరికి తీసుకురావడానికి సహాయపడుతుంది.

సుమారు 7,500 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో నిర్మించే, ఢిల్లీ-అమృత్ సర్-కత్రా ఎక్స్‌ప్రెస్ వే కు చెందిన మూడు రోడ్ ప్యాకేజీలకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వీటిలో, 4/6 వరసల యాక్సెస్ కంట్రోల్డ్ ఢిల్లీ-కత్రా-అమృత్‌సర్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం: ఎన్.హెచ్-44 లో బల్పువా నుండి గుర్వాబైల్‌దారన్, హీరానగర్ వరకు; గుర్వాబైల్‌దారన్, హీరానగర్ నుంచి జాఖ్, విజయపూర్ వరకు; అదేవిధంగా, గుర్వాబైల్‌దారన్, హీరానగర్ నుండి జాఖ్, విజయపూర్ వరకు మార్గాలు ఉన్నాయి.

రాటిల్ మరియు క్వార్ జల విద్యుత్ ప్రాజెక్టులకు కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. కిష్వార్ జిల్లాలోని చీనాబ్ నదిపై దాదాపు 5,300 కోట్ల రూపాయల వ్యయంతో 850 మెగావాట్ల రాటిల్ జలవిద్యుత్ ప్రాజెక్టును నిర్మించనున్నారు. మరో 4,500 కోట్ల రూపాయల కంటే ఎక్కువ వ్యయంతో క్వార్ జలవిద్యుత్ ప్రాజెక్ట్ కూడా కిష్వార్ జిల్లాలోని చీనాబ్ నదిపై నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలోని విద్యుత్ అవసరాలను తీర్చడంలో, రెండు ప్రాజెక్టులు సహాయపడతాయి.

జమ్మూ-కశ్మీర్ లో జన్-ఔషధి కేంద్రాల నెట్-వర్క్ ను మరింత విస్తరించే దిశగా, సరసమైన ధరలకు మంచి నాణ్యమైన జెనరిక్ ఔషధాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో, 100 కేంద్రాలను ప్రధానమంత్రి ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. కేంద్ర పాలిత ప్రాంతంలో ని మారుమూల ప్రదేశాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పల్లిలో 500 కిలోవాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను కూడా ఆయన ప్రారంభిస్తారు, దీంతో ఇది దేశంలో కర్బన రహిత మొదటి పంచాయతీగా అవతరిస్తుంది.

లబ్ధిదారులకు స్వామిత్వ కార్డులను ప్రధానమంత్రి అందజేశారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా వివిధ కేటగిరీల వారీగా అవార్డులు సాధించిన పంచాయతీలకు అవార్డుల కింద ప్రధానమంత్రి ఈ సందర్భంగా నగదు బదిలీ చేశారు. ఈ ప్రాంతానికి చెందిన గ్రామీణ వారసత్వాన్ని వర్ణించే "ఐ.ఎన్.టి.ఏ.సి.హెచ్." ఫోటో గ్యాలరీ తో పాటు, భారతదేశంలో ఆదర్శవంతమైన స్మార్ట్ గ్రామాలను తయారుచేయడానికి రూపొందించబడిన గ్రామీణ వ్యవస్థాపకత ఆధారిత నమూనా - ''నోకియా స్మార్ట్-పూర్'' ని కూడా ప్రధానమంత్రి తమ పర్యటనలో భాగంగా సందర్శించారు.

నీటి వనరుల పునరుజ్జీవనాన్ని నిర్ధారించాలనే ఉద్దేశ్యంతో, "అమృత్-సరోవర్" అనే కొత్త కార్యక్రమాన్ని కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. ''ఆజాదీ-కా-అమృత్-మహోత్సవ్'' వేడుకల్లో భాగంగా దేశంలోని ప్రతి జిల్లాలో 75 జలాశయాలను అభివృద్ధి చేయడం, పునరుద్ధరించడం దీని లక్ష్యం.

నేటి నుండి ఏప్రిల్ 30 వరకు 'కిసాన్ భాగిదారి, ప్రాథమికత హమారీ'

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:వ్యవసాయం, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ, వివిధ ఇతర మంత్రిత్వ శాఖల సహకారంతో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కింద 2022 ఏప్రిల్ 25 నుండి 30 వరకు 'కిసాన్ భాగిదారీ, ప్రాథమికత హమారీ' ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రచారం సందర్భంగా, వ్యవసాయం మరియు రైతు సంక్షేమ శాఖ రైతుల కోసం ప్రాంతీయ స్థాయిలో దేశవ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖ ప్రతి కృషి విజ్ఞాన కేంద్రంలో కృషి మేళాను, సహజ వ్యవసాయంపై క్షేత్ర ప్రదర్శనను నిర్వహిస్తుంది. ఉమ్మడి సేవా కేంద్రం (సిఎస్సి) నిర్వహించే పంటల బీమాపై దేశవ్యాప్తంగా వర్క్‌షాప్‌ను కేంద్ర వ్యవసాయ మంత్రి ప్రారంభించనున్నారు.

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖతో పాటు డిఏవై-ఎన్ఆర్ఎల్ఎం కింద వ్యవసాయ పర్యావరణ, పశువుల పద్ధతులపై ఒక ప్రసంగం ఉంటుంది. వారంలో వాణిజ్య మంత్రిత్వ శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఓడిఓపి)పై వెబ్‌నార్ నిర్వహిస్తారు. ఎంపిక చేసిన 75 మంది రైతులు, పారిశ్రామికవేత్తలతో జాతీయ ఆత్మ నిర్భర్ భారత్ కాన్క్లేవ్ కూడా నిర్వహిస్తున్నారు.

ఈ వారం రోజుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, మత్స్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ ఒక జిల్లా ఒక ఉత్పత్తి ఆధారిత వర్క్‌షాప్, వెబ్‌నార్, శాఖల వివిధ పథకాల గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాయి.దేశవ్యాప్తంగా ప్రత్యక్ష (ఆఫ్‌లైన్), వర్చువల్ (ఆన్‌లైన్) మాధ్యమం ద్వారా 1 కోటి కంటే ఎక్కువ మంది రైతులు, వాటాదారులు ఈ ప్రచారంలో పాల్గొంటారని భావిస్తున్నారు.

మాది జర్నల

ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలి - అదనపు కలెక్టర్ రమేష్

మెదక్, ఏప్రిల్ 25 (నేటి నిజం ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని, గైర్హాజర్ అయితే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ రమేష్ హెచ్చరించారు. గత ప్రజావాణికి, ఈ ప్రజావాణికి గైర్హాజర్ అయిన జిల్లా అటవీ శాఖాధికారికి మెమో జారీ చేయవలసినదిగా కలెక్టరేట్ ఏ.ఓ. మన్నాన్ కు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి లో అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజావాణిలో సమస్యల పరిష్కారమవుతాయన్న నమ్మకంతో సుదూర ప్రాంతాల నుండి ప్రజలు వస్తారని, అట్టి సమస్యల తక్షణ పరిష్కారానికి వెంటనే నిర్ణయాధికారాలు తీసుకునే అధికారం లేని క్రింది స్థాయి అధికారులు, సిబ్బందిని ప్రజావాణికి ఎట్టిపరిస్థితులలో పంపవద్దని సూచించారు. ఈ కార్యక్రమం ఎంతో ప్రాధాన్యతతో కూడుకొని ఉన్నందున దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉండి అంకిత భావంతో పనిచేయాలని, లేకపోతె కార్యక్రమం ప్రాధాన్యత సన్నగిల్లే ప్రమాదముందని అన్నారు. కలెక్టరేట్లో తో పాటు డివిజన్, మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో పలు దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని రమేష్ సూచించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాలు, మ్యూటేషన్, భూ నష్టపరిహారం, పింఛన్లు, రేషన్ బియ్యం, మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్ళు, ఉద్యోగాలు ఇప్పించమని తదితర సమస్యలతో 36 విజ్ఞప్తులు రాగా అదనపు కలెక్టర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, డి.ఎస్.ఓ. శ్రీనివాస్ లు వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారానికై అందజేస్తూ తగాదాలు, ఆస్తి గొడవలకు సంబంధించి పోలీస్ కేస్ ఫైయిల్ చేయాలని, కోర్టును ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ-కామర్స్ ప్లాట్‌ఫాం 'సెక్సీ బీస్ట్' లో సరికొత్త లీజర్‌వేర్, లాంజ్‌వేర్, లోదుస్తుల లభ్యం

హైదరాబాద్, ఏప్రిల్ 25: ఈ-కామర్స్ ప్లాట్‌ఫాం 'సెక్సీ బీస్ట్' లో సరికొత్త లీజర్‌వేర్, లాంజ్‌వేర్, లోదుస్తుల అత్యంత సరసమైన ధరలకే లభ్యమవుతున్నాయని సంస్థ సీఈవో, కో-ఫౌండర్ రాజ్ రానా తెలిపారు. స్లీప్‌వేర్, లాంజ్‌వేర్ ప్రముఖ ఫ్యాషన్ విభాగాలుగా ఉద్భవించాయన్నారు. హాయిగా, సౌకర్యవంతమైన వస్త్రధారణ ఇప్పుడు అవసరమైందన్నారు. ఈ వస్త్రాలు రోజంతా, రాత్రి వరకు ధరించవచ్చన్నారు. భారతీయ ఇన్నర్‌వేర్ ప్రస్తుతం 11 శాతం సీఏజీఆర్తో దాదాపు 44 వేల కోట్ల విలువైనదని పేర్కొన్నారు. డిసెంబర్ 2020లో ప్రారంభించబడిన ఈ వస్త్రాలు ప్రీమియం నాణ్యత, చమత్కారమైన డిజైన్‌లు, అత్యంత సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. బ్రాండ్ సొంత కర్మాగారాల్లో యాభై సంవత్సరాల అనుభవం మద్దతుతో వస్త్రాలు రూపొందించబడ్డాయన్నారు. సెక్సీ బీస్ట్ దాని ప్రత్యేకమైన, బోల్డ్, కలర్‌ఫుల్ డిజైన్‌లతో ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. ఇది ఒక నిర్దిష్ట మానసిక స్థితిని ప్రేరేపించడానికి మెరుగుపరచడానికి చాలా జాగ్రత్తగా తయారు చేయబడిందన్నారు. ప్రస్తుతానికి ఈ బ్రాండ్ 30కి పైగా డిజైన్‌లను కలిగి ఉందన్నారు. పెద్ద ప్రింట్‌లు, రంగులను మంచి నమ్మకంతో రూపొందించామని తెలిపారు.

పెద్ద పరిమాణం, రంగులు అర్థవంతమైన స్పష్టమైన అనుభూతి కోసం ఎంపిక చేయబడ్డాయన్నారు. గత దశాబ్దంలో మార్కెట్‌ను నిత్యావసర వస్తువు నుంచి ఫ్యాషన్ ప్రపంచంగా మార్చడాన్ని మనం చూశామన్నారు. మా ధర, స్థానాలు మమ్మల్ని 'సరసమైన లగ్జరీ' గొడుగు కింద ఉంచుతాయన్నారు. జెన్ జెడ్, మిలీనియల్స్ ప్రేక్షకుల సెగ్మెంటేషన్‌తో ప్రారంభమైనదన్నారు. మా ఉత్పత్తులు ప్రేక్షకులందరినీ ఆకర్షించే ప్రత్యేక స్థితిలో ఉన్నామన్నారు. ఇప్పటికే దాదాపు 40 ప్రింట్‌లు మార్కెట్‌లో ఉన్నందున, ప్రతి నెలా కొత్త సేకరణను విడుదల చేస్తూనే ఉన్నామన్నారు. ప్రతి వ్యక్తిత్వంలోని ప్రత్యేకతను చాటేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.. నేత, స్పర్శ పరంగా, వారి సూపర్ కోంబెడ్ ప్రీమియం కాటన్ డొమైన్‌లోని ఇతర బ్రాండ్‌ను అధిగమిస్తుందన్నారు. దీని ఆకృతితో చర్మంపై మృదువైనదిగా అనిపిస్తుందన్నారు. అదనంగా, రెండు వైపులా ప్రత్యేకంగా రూపొందించిన పాకెట్స్, ప్లైని వదిలించుకోవాలనే నిర్ణయం, ప్రత్యేకంగా ఎంచుకున్న పరిమాణం, ఇంటి లోపల, బయట ఉపయోగించడానికి వీలుగా ఉందన్నారు. ఉత్పత్తుల ధర అంతటా రూ. 199 నుంచి రూ. 1399 వరకు ఉంటుందన్నారు. సెక్సీ బీస్ట్ లో పర్యావరణ స్పృహ కూడా ఉందన్నారు. ప్లాస్టిక్‌లను వాడటం లేదన్నారు. రీసైకిల్ బాక్సుల వాడకంతో బాధ్యతాయుతమైన స్పృహ ప్యాకేజింగ్‌లో స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు.

గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:ఖేలో ఇండియా పేరిట విశ్వవిద్యాలయ క్రీడోత్సవం-2021 ఈరోజు బెంగుళూరులో వైభవంగా ప్రారంభమైంది. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఈ క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ఖేలో ఇండియా విశ్వవిద్యాయ క్రీడల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సందేశాన్ని వర్చువల్ పద్ధతిలో పంపించారు.

కర్ణాటక రాష్ట్ర గవర్నర్ తావర్ చంద్ గెహ్లోట్, కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడాశాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, సహాయమంత్రి నిశీత్ ప్రమాణిక్, క్రీడాశాఖ కార్యదర్శి శ్రీమతి సుజాతా చతుర్వేది తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, క్రీడా కార్యకలాపాలను గ్రామస్థాయి వరకూ ప్రోత్సహించవలసిన అవసరం ఉందని అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక పరిపాలనా సంస్థలు కలసికట్టుగా కృషిచేసి,. సమన్వయ కృషితో అట్టడుగు స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కృషితో భారతీయ క్రీడా కార్యకలాపాలు నూతన శిఖరాలను చేరుకుంటాయని ఆయన అన్నారు. కళాశాల ప్రవేశాల్లో క్రీడాకారులకు కొన్ని అదనపు మార్కులు ఇవ్వాలని, వివిధ శాఖల్లో ప్రమోషన్లు ఇవ్వాలని ఆయన సూచించారు. "ఇలాంటి ప్రోత్సాహకాలతో దేశంలో క్రీడలకు మంచి ఊపు లభిస్తుంది," అని ఉపరాష్ట్రపతి అభిప్రాయపడ్డారు.

మనమంతా పాత మూలాలకు తిరిగి చేరుకోవాలని, దేశీయ క్రీడలకు, గ్రామీణ క్రీడలకు భాగస్వామ్య వర్గాలవారంతా అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సారి ఖేలో ఇండియా క్రీడల్లో తొలి సారిగా యోగాసనాలు, మల్ల కంబ వంటి స్వదేశీ క్రీడాంశాలతో పాటుగా, మొత్తం 20 క్రీడాంశాల్లో పోటీలు జరగడం సంతోషదాయకమని అన్నారు. "మన గ్రామీణ, స్వదేశీ క్రీడలకు రక్షణ కల్పించి, వాటిని ప్రోత్సహించడం చాలా ముఖ్యం. ఈ క్రీడలు మన సంప్రదాయాల్లోకి చొచ్చుకుపోయాయి. మన సాంస్కృతిక వారసత్వంలో అవి ఒక భాగంగా నిలిచిపోయాయి," అని వెంకయ్యనాయుడు అన్నారు.

ఖేలో ఇండియా క్రీడోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో సందేశమిచ్చారు. దేశంలోని యువజన ఉత్సాహానికి బెంగుళూరు నగరం ప్రతీకగా నిలుస్తుందని, ప్రొఫెషనల్ క్రీడాకారులకు గర్వకారణమని ఆయన అన్నారు. ఇక్కడ క్రీడల, స్టార్టప్ కంపెనీల సంగమం కొనసాగడం చాలా గణనీయమైన పరిణామమని ఆయన అన్నారు. "ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడోత్సవం బెంగుళూరులో జరగడం సుందరమైన ఈ నగరం శక్తిని, ప్రత్యేకతను మరింత ద్విగుణీకృతం చేస్తుంది." అని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. వైరస్ మహమ్మారి రూపంలో ఎన్ని సవాళు ఎదురైనప్పటికీ క్రీడల నిర్వహణకు నిర్వాహకులు, నిర్వాహక సంస్థ నిర్ణయం తీసుకోవడం నవభారత దృఢ దీక్షను, క్రీడాతృష్ణను తెలియజేస్తోందని అన్నారు. ప్రతి రంగంలోనూ యువజనుల ఉత్సాహం నూతన భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్తోందని ప్రధానమంత్రి తన సందేశంలో అభిప్రాయపడ్డారు.

కలసికట్టుగా పనిచేయాలన్న స్ఫూర్తిని కలిగి ఉండటమే విజయానికి తొలి మంత్రమని ప్రధానమంత్రి అన్నారు. "కలసికట్టుగా ఒక బృందంగా పనిచేయాలన్న స్ఫూర్తి మనకు క్రీడల ద్వారానే లభిస్తుంది. ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడోత్సవంలో ఇది మనకు స్వయంగా అనుభవంలోకి వస్తుంది. ఇదే స్ఫూర్తి, జీవితాన్ని కొత్తగా విశ్లేషించగలిగే మార్గాన్ని తెలియజేస్తుంది." అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. "పరిపూర్ణత్వంతో కూడిన దృష్టి, పందశాతం అంకిత భావం క్రీడల్లో విజయానికి ఎంతో కీలకం. క్రీడారంగం నుంచి నేర్చుకున్న పాఠాలు ఎవరినైనా జీవితంలో ముందుకు తీసుకెళ్తాయి. నిజానికి క్రీడలు, జీవితానికి అందగా నిలిచే సినలైన వ్యవస్థ" అని మోదీ పేర్కొన్నారు. క్రీడలకు, నిజ జీవితానికి ఉన్న ఇతర పోలికలను ప్రధాని ఈ సందర్భంగా వివరించారు. తృష్ణ, సవాళు, ఓటమినుంటి పాఠాలు నేర్వడం, ఈ క్షణంలో జీవించగలిగే నిజాయితీని, సామర్థ్యాన్ని కలిగి ఉండటం.. ఇవన్నీ క్రీడల్లో, నిజ జీవితంలో ఉమ్మడిగా ఉండే స్వభావాలని అన్నారు. "విజయాన్ని సమంజసంగా స్వీకరించడం, పరాజయం నుంచి పాఠాలు నేర్చుకోవడం ముఖ్యమైన కళ, దీన్ని మనం క్రీడారంగంలోనే నేర్చుకోగలం." అని ఆయన అన్నారు.

ఖేలో ఇండియా విశ్వవిద్యాలయం క్రీడల ప్రారంభోత్సవంలో కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ మాట్లాడుతూ, క్రీడోత్సవానికి వచ్చిన 4,000మంది క్రీడాకారులకు సాంకేతిక పరిజ్ఞాన నగరమైన బెంగళూరు సుస్వాగతం పలుకుతోందని అన్నారు. "ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడోత్సవం-2021ను బెంగుళూరులో నిర్వహించడం మాకు సంతోషదాయకం, గౌరవప్రదంగా భావిస్తున్నాం. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర క్రీడా, యువజన వ్యవహారాల మంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రారంభోత్సవంలో భాగస్వాములు కావడం మా సంతోషాన్ని మరింత ఇనుమడింప చేస్తోంది. మా ఆతిథ్యాన్ని రుజువు చేసుకునేందుకు, జాతిపట్ల, సంస్కృతి పట్ల మా అంకితభావాన్ని ప్రదర్శించేందుకు ఖేలో ఇండియా విశ్వవిద్యాల క్రీడోత్సవం మాకు గొప్ప అవకాశాన్ని అందించింది. ఖేలో ఇండియా పథకం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మన క్రీడా ప్రపంచానికి కొత్త ఊపును తీసుకువచ్చారు." అని ఆయన అన్నారు.

కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూరు మాట్లాడుతూ, "ఖేలో ఇండియా పేరిట తొలి విశ్వవిద్యాలయ క్రీడోత్సవం ఒడిశాలో జరిగినపుడు ప్రజల్లో గొప్ప గౌరవభావం, ఉత్సాహం తొణికిసలాడింది. ఆ తర్వాత మన జీవితాలపై కొవిడ్ ప్రభావం పెరిగింది. అనంతరం ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడోత్సవం-2021 కోసం మనం దాదాపు రెండేళ్లు వేచి చూడాల్సి వచ్చింది. రెండేళ్ల తర్వాత విశ్వవిద్యాలయ క్రీడోత్సవం కోసం మనం తొలిసారిగా ఏకమయ్యాం. ఈ సారి కూడా నాకు యువజనుల్లో అదే తరహా తృష్ణ, ఉత్సాహం కనిపిస్తోంది. దాదాపు 200 విశ్వవిద్యాలయానుంచి సుమారు 4,000మంది క్రీడాకారులు పాల్గొనడంతో కర్ణాటకలోనే ఇది బహుళ క్రీడాంశాల అతిపెద్ద ఉత్సవంగా నిలిచింది. క్రీడోత్సవానికి ఆతిథ్యం ఇస్తున్న జైన్ విశ్వవిద్యాలయాన్ని నేను సందర్శించాను. ఈ పోటీల్లో పాల్గొనబోయే 500మందికి పైగా క్రీడాకారులను స్వయంగా కలుసుకున్నాను. ఈ క్రీడోత్సవం కోసం ప్రపంచ స్థాయి క్రీడా సదుపాయాలను కల్పించడం చాలా సంతోషంగా ఉంది. ప్రపంచంలోనే ఉత్తమమైన స్థాయిలో ఈ క్రీడా సదుపాయాలు ఉన్నాయి." అన్నారు.

కర్ణాటక రాష్ట్రానికి సంబంధించిన సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వ సంపదను ప్రతిబింబించే ప్రదర్శన, మల్ల కంబ, యోగాసన, వీక్షకులను ఆకట్టుకునే దృశ్యశ్రవణ ప్రదర్శన వంటివి, 2వ ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడల ప్రారంభోత్సవానికి అదనపు ఆకర్షణగా నిలిచాయి. బెంగుళూరులోని శ్రీ కంఠీరవ ఇండోర్ స్టేడియంలో 2022 ఏప్రిల్ 22 (ఆదివారం రోజున) ఈ క్రీడలు ఉత్సాహభరిత వాతావరణంలో మొదలయ్యాయి.

ఈ క్రీడల్లో ఆతిథ్య విశ్వవిద్యాలయమైన జైన్ విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒలింపిక్ స్టాండర్డ్ టైమ్ విజేత శ్రీహరి నటరాజ్ క్రీడాకారులందరి తరఫున ప్రమాణం చేశాడు. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు క్రీడలను ప్రారంభించిన వెంటనే శ్రీహరి నటరాజ్ తన ప్రమాణం తీసుకున్నాడు. ప్రముఖ క్రీడాకారులైన విమల్ కుమార్, అంజు బాబీ జార్జి, రీత్ అబ్రహాం, అశ్వినీ నాచప్ప, మాలతీ హొల్లా, బి.ఆర్. బీడు, ఎ.బి. సుబ్బయ్య, ఎస్.వి. సునీల్, వి.ఆర్. రఘునాథ్ తదితరులు ప్రారంభోత్సవంలో పాలు పంచుకున్నారు. కె.వై. వెంకటేశ్, ఎస్.ఎం. శశికాంత్ నాయక్, సహానా ఎస్.ఎం.,..మణికండన్, తాన్యా హేమంత్, ఫర్మాన్ బాషా కూడా ఈ క్రీడల ప్రారంభోత్సవానికి హాజరయ్యారు.

ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడోత్సవం 2021 గీతం ప్రధాన ఆకర్షణ..

ప్రారంభోత్సవ వేడుకలకు హాజరైన 2,500మంది వీక్షకులను డోళ్లు కుణితా వంటి అనేక సంప్రదాయ జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. పాప్ సంగీతకారుడు, కంపోజర్ అయిన చందన్ షెట్టీ రూపొందించిన క్రీడల గేయం నాట్య రూపకం వీక్షకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేరళ చండే, నాసిక్ డోళ్లు, పజాబీ డోళ్లు వంటి వాయుద్య కారుల ప్రదర్శన పది రోజుల క్రీడోత్సవానికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కళాకారులు ఈ ప్రదర్శనలో పాలుపంచుకున్నారు. స్వదేశీ విధానంలో యువత నైపుణ్యాలను ప్రదర్శించే 12వ శతాబ్దపు సంప్రదాయ క్రీడాంశమైన మల్లకంబను ఈ సంవత్సరం ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడోత్సవంలో చేర్చారు. ప్రారంభోత్సవంలో ఈ క్రీడాంశాన్ని కూడా ప్రదర్శించారు. కింగ్స్ యునైటెడ్ సంస్థకు చెందిన యువత ప్రదర్శించిన అద్భుతమైన వ్యాయామ విద్యా విన్యాసాలు వీక్షకులను ఎంతగానో అలరించాయి. స్టేడియం బయట ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్లపై ప్రారంభోత్సవ దృశ్యాలను పలువురు క్రీడాభిమానులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. క్రీడల ప్రారంభోత్సవాన్ని దూరదర్శన్ స్పోర్ట్స్ ద్వారా ప్రత్యక్షంగా ప్రసారం చేశారు. ఆకాశవాణి, రేడియో సిటీ ద్వారా ప్రత్యక్ష వ్యాఖ్యానం కూడా ప్రసారమైంది.

సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజంను సన్మానించిన తెరాస నేత ఎడపల్లి విష్ణు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ, ఏప్రిల్ 25: వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామానికి వచ్చిన రూరల్ మండలం సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజంను తెరాస రూరల్ మండలం ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు ఎడపల్లి విష్ణు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాండ్లు, గ్రామ సర్పంచ్ అధికం జైపాల్ రెడ్డి, ఎంపిటిసి నరసవ్వ బాల్ రెడ్డి, నూకలమర్రి సర్పంచ్ పెండ్యాల తిరుపతి, ఉప సర్పంచ్ తలారి సురేష్ మంజుల, వార్డ్ మెంబర్ తలారి లలిత రవి, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఈర్య నాయాక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అంబలి కేంద్రం ఏర్పాటు, ప్రారంభించిన డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్

మెదక్, ఏప్రిల్ 25 (నేటి నిజం ప్రతినిధి): సత్య సాయి సమితి సౌజన్యంతో హవేళిఘనపూర్ కు చెందిన రాజ రాజేశ్వరి బిన్నీ మోదరన్ పారాబాయిల్డ్ రైస్ మిల్లు వారు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ప్రజావాణికి జిల్లా నలుమూలాల నుండి వచ్చిన ప్రజలు అంబలిని తాగి కాస్త సేదతీరారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ ఎండలు మండిపోతున్న తరుణంలో కలెక్టరేట్ కు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి కోసం, ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చుటకు డి.ఆర్.డి.ఓ. ఆధ్వర్యంలో చలివేంద్రంతో పాటు సత్యసాయి సంస్థ వారు అంబలి కేంద్రాన్ని ప్రారంభించడం ముదాహమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.డి.మైన్స్ జయరాజ్, డి.ఎస్.ఓ. శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ. మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బజరంగ్‌దళ్ శాంతియాత్ర.. అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 25:కర్నూలు జిల్లా హ్వాళగుంద గ్రామంలో హిందువులు పవిత్రంగా భావించే ఆంజనేయస్వామి జయంతి రోజున "వీరహనుమాన్ విజయ యాత్ర" నిర్వహించగా స్థానిక మసీదు నుండి దుండగులు ఒక్కసారి చెప్పులు, రాళ్ళు, ఆయుధాలతో దాడిచేశారని బీజేపీ, బజరంగ్ దళ్ నేతలు అన్నారు. అనుకోకుండా వచ్చిన ఈ హఠాత్పరిణామానికి బయపడిన చాలామంది దిక్కుతోచక అటూ ఇటూ పరిగెత్తి ప్రాణాలను కాపాడుకున్నారన్నారు. ఈ ఘటనలో చాలామంది గాయపడ్డట్టు తెలిపారు. కాగా, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా హ్వాళగుందలో హనుమజ్జయంతి సందర్భంగా దాడిచేసిన వారితో పాటు.. దాడికి గురై బాధపడుతున్న 40 మంది అమాయకులపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఈ కేసులను ఎత్తివేయాలనీ డిమాండ్ చేశారు.

మహిళ జర్నలిస్టులు నిబద్ధతతో పోటీని తట్టుకొని ఖచ్చితమైన వార్తలను సమాజానికి అందించాలి - ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మెదక్, ఏప్రిల్ 25 (నేటి నిజం ప్రతినిధి): తెలంగాణ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని టూరిజం ప్లాజా లో రెండు రోజుల మహిళా జర్నలిస్టు శిక్షణ తరగతులు కొనసాగాయి. దీనిలో భాగంగా ఆదివారం నిర్వహించిన ముగింపు సమావేశంలో వాయిస్ ఆఫ్ వర్డ్స్ ఆంగ్ల దినపత్రిక కు విలేకరిగా పనిచేస్తున్న మెదక్ పట్టణానికి చెందిన మహిళా జర్నలిస్ట్ ఎం.రాణి ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్సీ వాణిదేవి చేతుల మీదుగా అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. స్థానిక సంస్థల నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ మహిళ జర్నలిస్టులు నిబద్ధతతో పోటీని తట్టుకొని ఖచ్చితమైన వార్తలను సమాజానికి అందించాలన్నారు. తాము రాసిన వార్తలలో వాస్తవాలతోనే ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటారని పేర్కొన్నారు. వార్తల్లోని వాస్తవాల ఆధారంగాఎలాంటి అవాంతరాలు, అవమానాలు ఎదురైనా వాటిని అధిగమించగలుగుతారని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమానికి 100కోట్ల నిధిని తెలంగాణ ప్రభుత్వం కేటాయించిందన్నారు. మహిళ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రెస్ అకాడమీ ప్రధాన కమిటీలో మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. యం.ఎల్.సి వాణి దేవి మాట్లాడుతూ జనంను జాగృతం చేసేది జర్నలిసం అని అన్నారు. జర్నలిస్టు లు బాధ్యత యుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ మహిళా జర్నలిస్టులకు చేయూత నిచ్చి ప్రోత్సహించేందుకు ప్రత్యేక సాంకేతిక కిట్ అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శివరత్నం, ధన్యరాజేందర్, మాలినిసుబ్రహ్మణ్యం, సుమబాల, రమా సరస్వతి, స్వేచ్ఛ ,వంశీ ప్రియలు, కవిత, వృత్తిరీత్యా తాము ఎదుర్కొంటున్న సమస్యలు, అనుభవాలను పంచుకున్నారు. సీనియర్ సబ్ ఎడిటర్ చీల మల్లేశం తరచూ వార్తల సేకరణ ప్రచురణలలో చోటు చేసుకుంటున్న భాషా సంబంధించిన తప్పుల సవరణకు సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ మేనేజర్ వనజ, , ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మహిళా ఎడిటర్ లు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఉచిత వాటర్ ప్లాంట్‌కు ప్రతిమ ఫౌండేషన్ చేయూత

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని 20వ వార్డులో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ కు ప్రతిమా ఫౌండేషన్ ఫౌండర్ వికాస్ రావు ఆర్థికసాయం చేసి, సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిమ మీ ముంగిట్లో ఆనే నినాదంతో ప్రతిమ వైద్య, విజ్ఞాన సంస్థ ప్రతిమ ఫౌండేషన్ మారు మూల గ్రామాలలో ప్రజల అవసరాలను గుర్తించి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో 20వ వార్డులో కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు తమ వార్డ్ ప్రజల సమస్యను ప్రతిమ ఫౌండేషన్ డాక్టర్ చెన్నామనేని వికాస్ ద్రుష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ కు ఆర్థికసాయం చేశారు. అలాగే కుమ్మరి వాళ్ళ ఇండ్లకు వెళ్లి వారి బాగోగులు తెలుసుకున్నారు. వారికి అవసరమైన కుండలు తయారు చేసే ఎలక్ట్రిక్ యంత్రాలు ఇస్తానని హామీ ఇచ్చారు.

బడుగు బలహీన కుల వృత్తులు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, 20వ డివిజన్ కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, ఎంపిపి బండ మల్లేశం వైస్ ఎంపీపీ జక్కుల తిరుపతి, ప్రజా ప్రతినిధులు,డివిజన్ ప్రజలు, ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలను సాధించాలి - జిల్లా గిరిజన అభివృద్ధి శాఖాధికారి కేశురాం

మెదక్, ఏప్రిల్ 25 (నేటి నిజం ప్రతినిధి): ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకొని నిరుద్యోగ యువత ప్రగతి బాటలో పయనించి అత్యుత్తమ ఫలితాలను సాదించాలని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖాధికారి కేశురాం సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో గిరిజన శాఖ ఆధ్వర్యంలో గ్రూప్స్, ఎస్. ఐ. మరియు పోలీస్ కానిస్టేబుల్ ల ఉచిత శిక్షణకై ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శారీర దారుఢ్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పరీక్షలకు హాజరైన యువతీ యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఉద్యోగాల నియామకాల ప్రక్రియకు సంబంధించి నిరుపేదలైన నిరుద్యోగ యువతీ యువకులకు ఆయా పరీక్షలలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ఏంటో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇస్తుందని అన్నారు. ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిరుద్యోగులు మంచి ఫలితాలను సాధించి ఉన్నత స్థాయి ఉద్యోగాలను సంపాదించాలని ఆకాంక్షించారు. జిల్లాలో ఎస్ ఐ మరియు పోలీస్ కానిస్టేబుల్ లకు గాను మెదక్, నర్సాపూర్, రామాయంపేట లో మూడు శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందని, అభ్యర్థులు వారికి సౌలభ్యమైన కేంద్ర